

# మనం



తూర్పు పశ్చిమ, కృష్ణ జిల్లాలు

మంగళవారం 25- 03 - 2025

4 పేజీలు


## ఈనెల 27న

## ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టు పర్యటన..

**సిఎం పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు**

**జేసీ పి.ధాత్రిరెడ్డితో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**





పోలవరం,మార్చి ,24(మనం న్యూస్) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 27న పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనుల పరిశీలన చేసేందుకు విచ్చేయుచున్న దృష్ట్యా ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డితో కలిసి ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సోమవారం ప్రాజెక్ట్ సైట్ లో పరిశీలించారు. అనంతరం ప్రాజెక్ట్ సైట్ సమావేశపు హాలులో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈనెల 27న ఉదయం ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించేందుకు పోలవరం విచ్చేస్తారని, ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులందరూ పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు.పోలవరం ప్రాజెక్ట్ పనులలో డయాఫ్రమ్ వాల్, అప్పర్ కాఫర్ డాం, లోయర్ కాఫర్ డాం, గ్యాప్ 1, గాప్ 2 , వైబ్రో కంప్రెషన్, తదితర పనులను పరిశీలించే అవకాశం ఉందన్నారు. అనంతరం అధికారులతో సమీక్షిస్తారన్నారు. ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించే ప్రదేశాలలో పనుల ప్రగతి సూచించే విధంగా ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసి, వివరాలు సీఎం కి తెలియజేయాలన్నారు. ఆయా ప్రదేశాలలో ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేయాలనీ పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ముఖ్యమంత్రిని కలిసేందుకు వచ్చే శాసనసభ్యులు, ప్రముఖులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ముఖ్యమంత్రి పాల్గొనే ప్రదేశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి,

# సింహాద్రి అప్పన్న సన్నిధిలో మంత్రి కందుల దుర్గేష్







- **ఏప్రిల్ 30న జరిగే స్వామి చందనోత్సవం నాటికి ప్రసాద్ స్కీం ద్వారా చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులు పూర్తిచేయాలని ఆదేశాలు జారీ**
- **భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**

విజయవాడ మార్చ్ 24 మనం ప్రతినిధి రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన సింహాచల శ్రీ వరాహ స్వామి అధ్యాత్మిక క్షేత్రాన్ని కూటమి ప్రభుత్వం మరింత అభివృద్ధి చేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం విశాఖ పర్యటనలో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ ప్రసిద్ధ సింహాచలం క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం (%ూఱశ్రీస్త్రఱఎఝస్త్రవ =వయబజవఞఱశీఅ ఖఅం రాజూఱతీఞఝశ్రీ ాబస్త్రఎవతఞఱశీఅ ఐతీఅజవ%) ద్వారా చేపడుతున్న ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఏపీ పర్యాటకాభివృద్ధికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుండి మంచి సపోర్ట్ ఉందని తెలుపుతూ పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడవద్దని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు.సకాలంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.నాణ్యత విషయంలో పొరపాట్లు దొర్లితే సహించేది లేదని హెచ్చరించారు. ఏప్రిల్ చివర్లో జరిగే చందనోత్సవం కార్యక్రమానికి క్యూ లైన్ పనులు, టాయిలెట్స్, బాత్ రూమ్స్ తదితర పనులు పూర్తి చేయగలిగితే భక్తుల తాకిడిని నియంత్రించవచ్చన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మే నాటికి పనులు పూర్తి చేసి భక్తులకు పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. గతంలో సింహాచలం దర్శనానికి వచ్చే భక్తులు కేవలం దర్శనం మాత్రమే చూసుకొని వెనుదిరిగేవారన్నారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలను చూసేందుకు అవసరమైన వసతులు ఉండేవి కావన్నారు. ప్రస్తుతం సింహాచలంకు వచ్చే భక్తులు దర్శనంతో పాటు నాలుగైదు రోజులు ఉండి చుట్టు ప్రక్కల ప్రదేశాలను చూసే విధంగా టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసి హోటల్స్, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.

విశాఖలో బీచ్, అడ్వెంచర్, ఎకో, క్రూయిజ్ టూరిజం ప్రక్రియలను పర్యాటకులు అనుభవించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.లంబసింగిలో మంచి రిసార్ట్స్ లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. బొర్రా గుహలను మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. పదుల సంఖ్యలో థీమాటిక్ అప్రోచ్ లతో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రస్తుతమున్న ప్రసాద్ స్కీంలో క్యూ కాంప్లెక్స్, ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా బట్టలు మార్చుకునే గదులు,స్నానాలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. వసతి కల్పన ఇందులో పొందుపరచలేదన్నారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన కెఫ్టేరియా ఉందన్నారు. భవిష్యత్ లో వేరే స్కీం లో వసతి సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రసాద్ స్కీం నిధుల విషయంలో ప్రభుత్వాల మార్పుతో, పనుల ప్రదేశాల మార్పు వల్ల కొంత జాప్యం జరిగిందన్నారు. నిధుల రాక కోసం పనులు పూర్తి చేసినట్లుగా యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నిధుల విడుదలకు ఏ ఇబ్బందిలేదన్నారు. దశలవారీగా నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి స్వయంగా చెప్పినట్లుగా మంత్రి దుర్గేష్ వెల్లడించారు.భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు.

### ప్రసాద్ స్కీం ద్వారా అన్నవరంలో అభివృద్ధి కార్యక్రమాలు: మంత్రి దుర్గేష్

ప్రసాద్ స్కీం క్రింద అన్నవరం పుణ్యక్షేత్రంలో కూడా పనులు జరుగుతున్నాయని మంత్రి దుర్గేష్ వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి, అంకిత భావాన్ని చూసి కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున సపోర్ట్ చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.ఏప్రిల్ నుండి నాలుగైదు ప్రధాన కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం సహకారంతో చేపట్టనున్నామన్నారు.

### పర్యాటక రంగం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది: మంత్రి దుర్గేష్

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.99 కోట్లతో అఖండ గోదావరి, రూ.77 కోట్లతో గండికోట ప్రాజెక్టులను చేపట్టామన్నారు. ఇప్పటికే అఖండగోదావరి ప్రాజెక్టులకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. గండికోటకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం వెల్లడించారు. త్వరితగతిన ఆయా ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు.ఇటీవల విశాఖపట్నంలో రీజినల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహించామని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. పీపీపీ విధానంలో పర్యాటకాభివృద్ధి చేస్తున్నామన్నారు. పర్యాటక రంగంలో చాలా మంది ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని గుర్తుచేశారు. 8 ఎంవోయూలు సైతం కుదుర్చుకున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని బీచ్ లకు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు సైతం మంచి స్ఫూర్తితో పనిచేయాలన్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను కలిసినప్పుడు ఏపీకి మరిన్ని ప్రాజెక్టులు కేటాయించేందుకు సుముఖత వ్యక్తం చేశారని గుర్తుచేశారు. రాష్ట్రానికి మంచి విజనరీ నాయకులు సీఎంగా, డిప్యూటీ సీఎంలుగా ఉన్నారని కేంద్రం నుండి ఎప్పుడూ ఏ సపోర్ట్ కావాలన్నా అందించేందుకు ముందుకు వస్తామని తెలిపినట్లు మంత్రి వివరించారు.అంతకుముందు వేదమంత్రోచ్చరణల మధ్య మంత్రి కందుల దుర్గేష్ సింహాచలం శ్రీ వరాహ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దర్శనం చేసుకున్నారు.ఈ క్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు,అధికారులు మంత్రి దుర్గేష్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి కప్పస్తంభం ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత మంత్రి దుర్గేష్ కు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదం అందజేశారు. అదే విధంగా ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని మంత్రి దుర్గేష్ కు అందజేశారు

# పదవి కోసం ఎప్పుడు పైరవీలు చేయలేదు





.కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

ఒక సాధారణ కార్యకర్తకు ఎంపీ టికెట్ ఇవ్వటంతో పాటు కేంద్రమంత్రి చేసింది

భీమవరం మార్చి 24 మనం న్యూస్ : సామాన్య కార్యకర్తను ఎంపీగా కేంద్ర మంత్రిగా చేయటం ద్వారా రాష్ట్ర బిజెపిలో కార్యకర్తల హవా ప్రారంభమైందని, తనతోపాటు జిల్లాలోని ప్రతి బిజెపి కార్యకర్త కేంద్ర మంత్రే అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భారతీయ జనతా పార్టీ పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో భీమవరంలోని ఆనంద ఇన్ ఫంక్షన్ హాల్లో జిల్లా బిజెపి అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జిల్లా బిజెపి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం మరియు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు అభినందన సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, బిజెపి నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు,సీనియర్ నాయకులు టీవీఎస్ వర్మ, నార్ని తాతాజీ, అల్లూరి సాయి దుర్గరాజు, కాగిత సురేంద్ర, ఈతకోట తాతాజీ, కలిదిండి వినోద్ వర్మ, పద్మావతి, పెద్ద సంఖ్యలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ తన విజయానికి అహర్నిశలు కష్టపడి పని చేస్తూ పార్టీ జెండా ను భుజాలపై మోసిన ప్రతి కార్యకర్తల కోసం విశ్రాంతి లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తానని అన్నారు. సేవ చేయాలి అంటే ప్రజాస్వామ్యంలో పదవి అతి ముఖ్యమని, రాజకీయాల్లో లక్ష్యం లేకుండా పని చేయడం అనవసరం అన్నారు. భారతీయ జనతా పార్టీలో పైరవీలకు విలువ లేదని, కులం, డబ్బు ప్రతిపాదన రాజకీయాలు బిజెపిలో సాధ్యం కాదన్నారు. అంతకుముందు బిజెపి నాయకులు మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ అభివృద్ధి తోపాటు రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రీనివాస్ వర్మ చేస్తున్న కృషిని బిజెపి నాయకులు కొనియాడారు.నష్టాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ కు పూర్వ వైభవం తెచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారితో పాటు పలుమార్లు కేంద్రమంత్రులను కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రజల స్టీల్ ప్లాంట్ సెంటిమెంటును తెలియజేసి కేంద్ర ప్రభుత్వం సుమారు 13 వేల కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడంలో కీలక పాత్ర వహించటం, నర్సాపురం పార్లమెంట్ అభివృద్ధికి దీర్ఘకాలిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రెండున్నర దశాబ్దాలుగా ముందుకు సాగని ఆకివీడు- దిగమర్రు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు 2,400 కోట్ల రూపాయలు మంజూరు చేయించి కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు సాధించడం, పిప్పర నుండి లోసరి వరకు రోడ్డు నిర్మాణానికి సి ఆర్ ఐ ఎఫ్ నిధులు నుండి 100 కోట్ల రూపాయలను మంజూరు చేయించడం, నర్సాపురం పార్లమెంట్ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక డయాలసిస్ యూనిట్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు, ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పనకు సిఎస్ఆర్ నిధుల నుండి 15 కోట్ల రూపాయలు మంజూరు చేయించడం, భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి 24 కోట్ల రూపాయలు మంజూరు వంటి ఎన్నో సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రిగా శ్రీనివాస్ వర్మ సమర్థవంతంగా పనిచేస్తున్నారని. కచ్చితంగా నరసాపురం పార్లమెంట్ అభివృద్ధి కి రోల్ మోడల్ గా శ్రీనివాస్ వర్మ తీర్చుదిద్దుతారని బిజెపి నాయకులు పలువురు పేర్కొన్నారు.

# వైద్యసేవలకు రాష్ట్ర బడ్జెట్లో రూ 19,264 కోట్లను కేటాయించడం చరిత్రాత్మకం.





- **నిరుపేదలు అత్యవసర సమయంలో ప్రైవేటు వైద్యం చేయించుకున్నను ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుంది.**
- **28 మంది నిరుపేదలకు రూ 12.60 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ.**
- **రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు ...**

పాలకొల్లు, మార్చి 24,మనం ప్రతినిధి :గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం వచ్చిన ధరఖాస్తులు బుట్ట దాఖలు అయ్యేవని,కూటమి ప్రభుత్వంలో నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకుంటుందని మంత్రి రామానాయుడు అన్నారు.సోమవారం స్థానిక రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి కార్యాలయంలో 28 మంది నిరుపేదలకు రూ 12.60 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటోలను మంత్రి రామానాయుడు అందచేసారు.ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు నిరుపేద వర్గాలకు అన్ని రకాల వైద్యం అందేలా రాష్ట్ర బడ్జెట్లో రూ 19,264 కోట్లను కేటాయించిందని అన్నారు.ప్రైవేటు ఆస్పత్రులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను రూ 1300 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు.ప్రతి పేదవాడికి కార్పొరేటు వైద్యం అందేలా రూ 25 లక్షల ఆరోగ్య భీమా పథకం కూటమి ప్రభుత్వ అమలు చేయనుందని మంచి ఆరోగ్య శుభపరిణామం అన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో గుండె నొప్పి వచ్చిన వెంటనే చేసే రూ 45 వేలు విలువ గల ఇంజక్షను ఉచితంగా ఇస్తున్నామని,ఎన్నో ప్రాణాలు కాపాడగలుగుతున్నామని అన్నారు.పేద ప్రజల ఆరోగ్యం కోసం ఇంటింటికి క్యాన్సరు స్క్రీనింగు పరీక్షలను 4 కోట్ల 10 లక్షల మందికి పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. కిడ్నీ రోగుల పాలిట వరంగా ప్రతి నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్లను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామని తెలిపారు.గత ప్రభుత్వంలో పేదలు,మధ్యతరగతి వర్గాలు వైద్యం నిమిత్తం సాయం కోసం చేసుకున్న ధరఖాస్తులు చెత్త బుట్టలో,కాలువల గట్లమీద పడవేస్తే నేడు కూటమి ప్రభుత్వంలో ధరఖాస్తు చేసుకుంటే చాలు ఏటువంటి కష్టం లేకుండా మిమ్మల్ని పిలిచి సాయం అందిస్తున్నా మని తెలిపారు.నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధిగా లక్షలాది రూపాయలు ప్రతివారం పంపిణీ చేస్తున్నామన్నారు.గత ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదలకు ఉచిత వైద్యాన్ని పూర్తిగా దూరం చేశారన్నారు.రాష్ట్రం లోటు బడ్జెటు ఉన్నను అసలు వడ్డీలను కడుతూ, ప్రజలపై భారం పడకుండా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలు కోట్లాది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందించి ఆదుకుంటున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చేట్టి బాబు,కోడి విజయభాస్కర్,గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, పెనుమత్స రామభద్రరాజు, బొప్పన హరికిషోర్,ధనాని సూర్యప్రకాష్,పోట్నూరి శ్రీనివాస్,చినమిల్లి గణపతి రావు,పాలవలస తులసీరావు, బందేల భాస్కరరావు, మల్లంపల్లి ఫకీరుబాబు,పీతల శ్రీనివాసు,టిడిపి,బిజెపి, జనసేన నాయకులు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక వైద్య సేవలు ప్రజలందరికీ అందుబాటులోకి రావాలి

- ప్రశాంత్ హాస్పిటల్ రెజ్యూమ్.. ప్రోస్టేట్ చికిత్సల్లో గేమ్ చేంజర్
- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- రాష్ట్రంలో తొలిసారిగా ప్రశాంత్ హాస్పిటల్లో విప్లవాత్మక 'రెజ్యూమ్' చికిత్స ఆవిష్కరణ
- ప్రోస్టేట్ సమస్యలకు 'రెజ్యూమ్'తో మెరుగైన ఫలితాలు
- ప్రోస్టేట్ సమస్యలకు సంబంధించిన అన్ని వ్యాధులకు దేశంలోని మొట్టమొదటి సమగ్ర చికిత్సా విభాగం
- ప్రశాంత్ హాస్పిటల్ చైర్మన్, ప్రఖ్యాత యూరాలజిస్ట్ డాక్టర్ కె. ప్రశాంత్ కుమార్
- రెజ్యూమ్ ఆవిష్కరణకు హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, కామినేని శ్రీనివాస్, బోడే ప్రసాద్





గాంధీనగర్ మార్చ్ 24 మనం న్యూస్: అత్యాధునిక వైద్య సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. నగరంలోని ప్రశాంత్ హాస్పిటల్లో, ప్రోస్టేట్ సమస్యలకు అందుబాటులోకి వచ్చిన విప్లవాత్మక చికిత్సా విధానం 'రెజ్యూమ్'ను రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, కామినేని శ్రీనివాస్, బోడే ప్రసాద్ లతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా అందుబాటులోకి వచ్చిన ఈ ఆధునిక చికిత్సతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడం సాధ్యమవుతుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవను మరింత విస్తరించి పేద ప్రజలకు సైతం అత్యున్నత స్థాయి కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు కార్పొరేట్ ఆసుపత్రుల వారు సహకరించాలని కోరారు. ప్రశాంత్ హాస్పిటల్ ఆవిష్కరించిన 'రెజ్యూమ్' ప్రోస్టేట్ సంబంధిత వ్యాధుల చికిత్సలో గేమ్ చేంజర్ గా నిలుస్తుందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం, ప్రశాంత్ హాస్పిటల్ చైర్మన్, ప్రఖ్యాత యూరాలజిస్ట్ డాక్టర్ కె. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రోస్టేట్ సమస్యలకు సంబంధించిన అన్ని వ్యాధులకు దేశంలోని మొట్టమొదటి సమగ్ర చికిత్సా విభాగంగా ప్రశాంత్ హాస్పిటల్ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రోస్టేట్ సంబంధిత సమస్యలన్నింటికీ పరిష్కారంగా విప్లవాత్మకమైన రెజ్యూమ్ వాటర్ థెరపీని అందుబాటులోకి అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ చికిత్స యుఎస్ఎఫ్డీఏ ఆమోదితమైన, అత్యంత సరళతరమైన అత్యాధునిక చికిత్స అని తెలిపారు. ఈ రెజ్యూమ్ థెరపీ బీహెచ్పీ చికిత్సల్లో అతి పెద్ద మార్పు తీసుకువస్తుందని చెప్పారు. రెజ్యూమ్ వాటర్ థెరపీలో, పెద్ద శస్త్రచికిత్స అవసరం లేదని, జనరల్ అనస్థీషియా కూడా అవసరం ఉండదని అన్నారు. అతి తక్కువ సమయంలో కోలుకునే అవకాశం ఉంటుందని, సెక్సువల్ ఫంక్షన్‌కి ఎటువంటి హాని ఉండదని చెప్పారు. దీర్ఘకాలిక మందులు వాడాల్సిన అవసరం తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ థెరపీ ద్వారా నీటి ఆవిరిని ఉపయోగించి ప్రోస్టేట్ గడ్డలను తగ్గించడం ద్వారా, మూత్ర సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ థెరపీ ద్వారా ఇది రోగులకు సురక్షితంగా, వేగంగా, జీవిత నాణ్యతను కాపాడుతూ చికిత్స అందించవచ్చని డాక్టర్ ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ కె. ధీరజ్, హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరో ఆంకాలజిస్ట్ డాక్టర్ కె. ప్రీతమ్, యూరో గైనకాలజిస్ట్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ పి. హరిత, హైరిస్క్ ప్రెగ్నెన్సీ అండ్ ఫీటల్ మెడిసిన్ ఎక్స్పర్ట్ డాక్టర్ శ్వేత సీవోవో బి. రమేష్, నగరంలోని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియోలో అగ్రగామిగా ఎస్యూడీ లైఫ్

గాంధీనగర్ మార్చ్ 24 మనం న్యూస్:-దేశంలో ప్రముఖ భీమా సంస్థ గా పేరుగాంచిన స్టార్ యూనియన్ డైఈచీ లైఫ్ ఇన్సూరెన్స్ తన క్లైమ్ సెటిల్మెంట్ రేషియో లో పెరుగుదల సాధించినట్లు ఎస్ యూడీ డైరెక్టర్ అభయ్ తివారి తెలిపారు. తన క్లెయిమ్ సెటిల్‌మెంట్ అనుభవాన్ని నిరంతర మెరుగుదలతో ఆవిష్కరణ, సమర్థత, కస్టమర్ కేంద్రీకృతత పై దృష్టి పెట్టి విప్లవాత్మకంగా మారుస్తోందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే, ఎస్ యూడీ లైఫ్ వ్యక్తిగత క్లెయిమ్‌ల కోసం 98.29 శాతం సెటిల్‌మెంట్ రేషియో, గ్రూప్ క్లెయిమ్‌ల కోసం 95.53 శాతం, ప్రధాన్ మంత్రీ జీవిత జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) క్లెయిమ్‌ల కోసం 99.09 శాతం సెటిల్‌మెంట్ రేషియో సాధించిందన్నారు. అదనంగా, అదే ఆర్థిక సంవత్సరంలో, కంపెనీ 1,992 వ్యక్తిగత మృతిచెందిన క్లెయిమ్‌లను రూ. 120.97 కోట్ల విలువతో, 2,190 గ్రూప్ క్లెయిమ్‌లను రూ. 159.16 కోట్ల విలువతో, 17,386 పీఎంజేజేబీవై క్లెయిమ్‌లను ?347.72 కోట్లతో విజయవంతంగా సెటిల్ చేసిందన్నారు. ఈ అంకెలు ఎస్ యూడీ లైఫ్ యొక్క క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లో ఇటీవలేళ్లలో ఉన్న నిరంతర మెరుగుదల పథాన్నీ సూచిస్తున్నాయన్నారు. కంపెనీ యొక్క 2023-24 ఆర్థిక సంవత్సరం పనితీరు 2022-23 ఆర్థిక సంవత్సరం నుండి గణనీయమైన మెరుగుదలని సూచిస్తుందని, ఆ సమయంలో అది వ్యక్తిగత క్లెయిమ్‌ల కోసం 96.07 శాతం, గ్రూప్ క్లెయిమ్‌ల కోసం 97.37 శాతం , పీఎంజేజేబీవైక్లెయిమ్‌ల కోసం 96 శాతం స్థిరమైన సెటిల్‌మెంట్ రేషియోలను నిర్వహించిందన్నారు. ఈ పెరుగుదల 2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమైందని, అప్పటికి ఎస్ యూడీ లైఫ్ వ్యక్తిగత క్లెయిమ్‌ల కోసం 97.42 శాతం, గ్రూప్ క్లెయిమ్‌ల కోసం 97.95 శాతం, పీఎంజేజేబీవై క్లెయిమ్‌ల కోసం అద్భుతమైన 98.26 శాతం సెటిల్‌మెంట్ రేషియోను సాధించిందన్నారు. క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియోలను నిరంతరం పెంచుకుంటూ, ఎస్ యూడీ లైఫ్ తన కార్యనిర్వహణలో విశిష్టమైన పనితీరు కనబరుస్తూ ముందుకు సాగుతున్నట్టు చెప్పారు.

## ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా డాక్టర్ సూర్యదేవర కేశవరావుబాబు



గాంధీనగర్ మార్చ్ 24 మనం న్యూస్: వైద్య రంగంలో విశేష సేవలందించిన డాక్టర్ సూర్యదేవర కేశవరావు బాబు ప్రతిష్టాత్మకమైన పదవికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా ఆయనను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసిన డాక్టర్ కేశవరావుబాబు.. మధుమేహ చికిత్సా నిపుణులుగా విశిష్ట ఖ్యాతి గడించారు. మధుమేహం, రక్తపోటుకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలుగు భాషలో పలు రచనలు చేసి, వైద్య పరిశోధనల్లోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఓడీఏ ప్రాజెక్టు వైద్యాధికారిగా, వీఎంసీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసరుగా, వీఎంసీ స్కూల్ హెల్త్ ప్రాజెక్ట్ హెల్త్ ఆఫీసరుగా సేవలందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ అధ్యక్షుడిగా సమర్థవంతంగా సేవలందించిన డాక్టర్ కేశవరావుబాబు.. ప్రస్తుతం ఐఎంఏ స్టేట్ వర్కింగ్ కౌన్సిల్ మెంబరుగా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా, హాస్పిటల్ బోర్డ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నిర్వహించిన పలు కార్యక్రమాలకు పరిశీలకుడిగా వ్యవహరించారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ సలహాదారుడిగా సేవలందించిన డాక్టర్ కేశవరావుబాబు.. వివిధ అంశాలపై టీవీ, రేడియో మాధ్యమాల్లో అనేక ప్రసంగాలు చేశారు. ప్రధానంగా మధుమేహానికి సంబంధించి అనేక సదస్సుల్లో ప్రసంగించి, అత్యాధునిక చికిత్సలను ప్రజలకు చేరువ చేసేందుకు అద్వితీయమైన కృషి చేశారు. డాక్టర్ కేశవరావుబాబు సేవలను మరింత విస్తృతంగా వినియోహించుకోవాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆయనను ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబరుగా నియమించింది. ఈ నియామకం పట్ల డాక్టర్ కేశవరావుబాబు సంతోషం వ్యక్తం చేశారు. తనకు లభించిన ఈ పదవిని బాధ్యతగా భావించి, అంకితభావంతో సేవలందిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ కేశవరావు బాబుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పలువురు వైద్య నిపుణులు శుభాకాంక్షలు తెలియజేశారు. విజయవాడ నగర ప్రజలకు.. మరీ ముఖ్యంగా వన్ టౌన్ ప్రజలకు విశేష సేవలందించిన డాక్టర్ కేశవరావుబాబు.. ఏపీ మెడికల్ కౌన్సిల్ పదవికి మరింత వన్నె తెస్తారని వారు పేర్కొన్నారు.

## గ్రామ సమస్యలపై గ్రామ సభ నిర్వహించిన జగ్గంపేట గ్రామ పంచాయతీ.

### పారిశుద్ధ్య కార్మికులకు ఉగాది కానుకగా నూతన వస్త్రాలు నగదు పంపిణీ.



జగ్గంపేట మార్చి 24: మనంన్యూస్. కాకి నాడజిల్లా జగ్గంపేట. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచి బచ్చుల నాగరత్నం అధ్యక్షతన గ్రామసభను పంచాయతీ సెక్రెటరీ శివ నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బంది పాల్గొని గ్రామీణాభివృద్ధికి పలు అంశాలపై చర్చించి తీర్మానలు చేశారు. మొదటి అంశంలో ఇళ్లకు విద్యుత్, తాగునీటి కనెక్షన్లు, మరుగుదొడ్డి సదుపాయం, వంటగ్యాస్ కనెక్షన్లు ఇవ్వడంపై చర్చించారు. రెండో అంశం కింద మురుగు కాలువలు, మురుగునీటి వ్యవస్థ నిర్వహణ, వీధి దీపాలు, సిమెంట్ రహదారులు, ఘనవ్యర్థాల నిర్వహణపై చర్చించారు. అలాగే మూడో అంశంగా గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణంతోపాటు ఇంకుడుగుంతలు, పంటకుంటల నిర్మాణం, ఉద్యానవన, పట్టు పరిశ్రమ అభివృద్ధికి సదుపాయాల కల్పన, పశువుల పెంపకంపై చర్చించారు.ఉపాధిహామీ పథకంపై అవగాహన గ్రామాల అభివృద్ధిలో కీలకంగా మారిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు రాబోయే కాలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు తెలియజేశారు. గ్రామసభల ద్వారా ప్రజలందరికీ ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పించి ఉపాధి హామీ పనులకు గ్రామసభల ద్వారా ఆమోదం పొందేందుకు ఒకేసారి వీటిని నిర్వహిస్తోంది. ప్రభుత్వం ఉపాధి పనులు క్రమపద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించింది. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద పనిదినాలు కల్పించనున్నారు. అనంతరం ఉగాది పండుగ పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులందరికీ నూతన వస్త్రాలు, 500 రూపాయలు నగదు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్ వి ఎస్ అప్పలరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) జీనుమణి బాబు, దేవరపల్లి మూర్తి, బచ్చుల సుధీర్, చెలికాని హరిగోపాల్, డేగల సత్తిబాబు, కోడూరి రమేష్, మారిశెట్టి గంగ, బద్ది సురేష్, వార్డ్ నెంబర్లు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

### ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ




భీమవరం మార్చి 24 మనం న్యూస్ :ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని భీమవరం ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ అన్నారు. భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జెపి రోడ్డులోని పెట్రోల్ బంక్ లో మోటార్ మెకానిక్ వర్కర్స్ తో అవగాహన సదస్సు నిర్వహించి ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ ను నిషేధిస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటారని, ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా ప్రచారాలు చేస్తున్నామని, వ్యాపారస్తులు సహకరించి ప్లాస్టిక్ కవర్లను నిషేదించాలని అన్నారు. అనంతరం 100 మందికి ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భట్టిప్రోలు శ్రీనివాసరావు, వ్యాపారస్తులు, మోటార్ మేకానికర్స్ పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

### రాజ్యాంగ పరిరక్షణ ప్రచార కార్యక్రమల్లో ప్రజలు భాగం పంచుకోవాలి




భీమవరం మార్చి 24 మనం న్యూస్ :రాజ్యాంగ లక్ష్యాలు నెరవేర్చడానికి, ప్రజాస్వామ్య మనుగడకు, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ఏప్రియల్ 14 వరకు సిపిఐ చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ ప్రచార కార్యక్రమల్లో ప్రజలు భాగం పంచుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మార్చి 23 భగత్ సింగ్ వర్ధంతి నుంచి ఏప్రియల్ 14 అంబేద్కర్ జయంతి వరకు రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం భీమవరంలో రాజ్యాంగ పరిరక్షణ ప్రజా యాత్రను సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ గత పదకొండేళ్లుగా దేశంలో ప్రజాస్వామ్యం మంటకలిసిపోతుందని, మోడీ పరివారం రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని, లౌకిక వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని, రాజ్యాంగం అమలు ప్రశ్నార్థకంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రిభాషా సూత్రం పేరుతో దక్షిణాది రాష్ట్రాలపై హిందీ భాషను రుద్దుతున్నారని, మరో పక్క ప్రాంతాల మధ్య, మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని కోనాల విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మేస్తూ కార్పోరేట్ వర్గాలకు మేలు చేస్తున్నారని, అరాచకాలను ప్రశ్నిస్తున్న గౌరీ లోకేష్, దబోల్కర్, గోవింద పన్సారే, కల్బుర్గి వంటి ప్రజాస్వామ్యవాదులను హత్యలు చేస్తున్నారని, నల్లసాగు చట్టాలు, నాలుగు లేబర్ కోడ్లు పేరుతో అరాచకం సృష్టిస్తున్నారని వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోనాల పేర్కొన్నారు. సర్దార్ భగత్ సింగ్ బ్రిటిష్ ధాస్యశృంఖలాల నుంచి భారత దేశాన్ని విడిపించడానికి తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి ఉరికంబమెక్కిన దేశ భక్తుడిని పేదరికంలేని, దోపిడీ రహిత సమాజం కోసం కలలు కన్నారని ఆమన ఆశయాలకు పాలకులు తుంగలో తొక్కుతున్నారని కోనాల ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ ఆశయాలను తుంగలోకి తొక్కుతున్న, స్వాతంత్ర్య ఉద్యమంతో ఏ సంబంధంలేని నేటి పాలకులు రాజ్యాంగాన్ని తిరగ రాయడానికి కుట్రలు పన్నుతున్నారని, రాజ్యాంగ వ్యవస్థలను కూల్చేస్తున్నారని, స్వేచ్ఛ, సమానత్వం, లౌకిక వాదం, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా నేడు పాలన సాగిస్తున్నారని కోనాల ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి పెను ప్రమాదం ఏర్పడిందని, రాజ్యాంగాన్ని సంరక్షించుకునే భాద్యత ప్రతి ఒక్కరికీ వుందని కోనాల అన్నారు. ఏప్రియల్ 14 వరకు సిపిఐ చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ ప్రచార కార్యక్రమల్లో ప్రజలు భాగం పంచుకోవాలన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సదస్సులు, సమావేశాలు, ర్యాలీలు ప్రచార జాతా కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. ఎన్డీఏ పాలకులు దేశంలో మతాన్ని, కులాన్ని, భాషను చీల్చి దేశ సమగ్రతకు భంగం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని అమలు చేయడంలో, లౌకిక వ్యవస్థను కాపాడటంలో మోడీ వైఫల్యం చెందాడని నెక్కంటి ద్వజమెత్తారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి సీపిఐ చేపట్టిన రాజకీయ ప్రచార జాతాల్లో ప్రజలందరూ పాల్గొనాలని నెక్కంటి విజ్ఞప్తి చేశారు. ప్రచార యాత్ర ర్యాలీ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సికిలే పుష్ప కుమారి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తమరాని శ్రీనివాస్, కౌలు రైతులు జిల్లా కార్యదర్శి బద్దా రమేష్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, కోన గొల్లయ్య, సనపల శ్రీనివాసరావు, కర్రి సూరిబాబు, ఎం.లక్ష్మీపతి, నాగిడి శాంతమూర్తి, పిడుగు సత్తిబాబు, జిత్తుగ మీరయ్య, చిత్తరంజన్, ఎఐటియుసి నాయకులు పి.జాకబ్, బి.శ్రీనివాసరావు, చంద్రశేఖర్,ఛాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## విధేయుడు టిడిపి " సోల్జర్




- సారేపల్లి రాధాకృష్ణ..
- దుర్గ గుడి చైర్మన్ రేసులో బీసీ నేత..

- క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వం ఉన్న నేత గా రాధాకృష్ణకు గుర్తింపు
- పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు...
- టిడిపి అభివృద్ధి లక్ష్యంగా..

ఉద్యమాల ప్రయాణం..

వ్యక్తిత్వం కలిగి నేతగా.... తెలుగుదేశం పార్టీ అభివృద్ధి లక్ష్యంగా.... పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో ఉద్యమాలు... పలుమార్లు ఎన్నో అవకాశాలు వచ్చినప్పటికీ... నమ్మినవారికి మంచి చేయాలనే భావంతో... ఆయన క్యాడర్ ను బలోపేతం చేస్తూ " సోల్జర్ " గానే... టిడిపి పక్షాన విజయవాడ పశ్చిమ లో కీలక పాత్ర పోషిస్తూ... కూటమి అధికారం చేపట్టేందుకు... నిస్వార్థ సేవలు... బీసీ నాయకుడిగా... ఆధ్యాత్మికత, క్రమశిక్షణ

పార్టీ విధేయుడిగా సారేపల్లి రాధాకృష్ణ మంచి గుర్తింపు పొందారు... శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం చైర్మన్ రేసులో ఇప్పుడు ఆయన పేరు వినిపిస్తోంది....

విజయవాడ మార్చి 24 (మనం ప్రతినిధి) పార్టీ నే లక్ష్యం..టిడిపి అధికారం చేపట్టాలి... ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండాలి... ఆంధ్రప్రదేశ్ బాగుండాలి అనే తపన ఆయన లో జీర్ణించుకుపోయింది... తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు టిడిపి బలోపేతమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తున్న సారేపల్లి రాధాకృష్ణ... ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీరోచిత పోరాటం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 22 డివిజన్లు క్యాడర్ ను పూర్తి సమన్వయంతో ఏకం చేసి అప్పటి వైకాపా పాలన లో లోపించిన అభివృద్ధి సంక్షేమం, జగన్ అక్రమాలపై నిరంతరం పోరాటం చేసిన తీరు మరిచిపోలేనిది ఆయనకు పలుమార్లు కార్పొరేటర్ గా అవకాశం వచ్చినప్పటికీ ఆర్థికంగా కొట్టుమిట్టాడుతున్న వారిని గుర్తించి వారికి కార్పొరేటర్ల సీటు కట్టబెట్టి ఆ కుటుంబాల్లో వెలుగు చూసేందుకు రాధాకృష్ణ పడిన తపన మరిచిపోలేమని టిడిపి క్యాడర్ పేర్కొంటున్న తీరు ఆయనలోని చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.

### బీసీ నేతగా గుర్తింపు

### బలహీనవర్గాల కు చెందిన యాదవ సామాజిక వర్గంలో జన్మించిన రాధాకృష్ణ

ఆధ్యాత్మిక కార్యక్రమాలు వేణుగోపాలస్వామి ఆలయం అభివృద్ధి తొ పాటు అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన తీరు ఆయనలో ఉన్న ఆధ్యాత్మికతను తెలియజేస్తోంది.

### క్రమశిక్షణకు పెట్టిన పేరు సారేపల్లి

క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా నేతగా సారేపల్లి రాధాకృష్ణ గుర్తింపు తెచ్చుకున్నారు. విజయవాడ నగరంలో సారేపల్లి రాధాకృష్ణ అని చెప్పగానే టక్కున గుర్తుకు వచ్చి క్రమశిక్షణకు మారుపేరు సారేపల్లి అని అందరి నోటా చెప్పే రీతిలో ఆయన తన ఇంటి పేరు ముందు క్రమశిక్షణ సారేపల్లి అని పిలిపించుకునే స్థాయికి ఎదిగారంటే ఆయన అలవర్చుకున్న మంచి వ్యక్తిత్వం తెలియజేస్తోంది..

### దుర్గగుడి చైర్మన్ గా సారేపల్లి రాధాకృష్ణ..?

వ్యక్తిత్వంతో పాటు అందర్నీ మనుషులుగా గుర్తించి ప్రేమించే మనస్తత్వం కలిగిన సారేపల్లి రాధాకృష్ణకు అమ్మవారి ఆలయ చైర్మన్ వరించే అవకాశం ఉందని ఆ పార్టీ క్యాడర్ విశ్వసిస్తోంది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనా చౌదరి గెలుపు కోసం అదే విధంగా విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని విజయం కోసం రాధాకృష్ణ శ్రమించిన తీరును కూటమి నేతలు నాయకులు, కార్యకర్తలు గుర్తుచేస్తూనే ఉన్నారు. పార్టీ అధినాయకత్వం క్రమశిక్షణ కలిగిన మంచి వ్యక్తిత్వం ఉన్న అందర్నీ కలుపుకొని సమన్వయంతో ముందుకు వెళ్లే వారిని గుర్తించి, విధేయత కలిగిన వారికి అమ్మవారి ఆలయ చైర్మన్ బాధ్యతలు అప్పగించే యోచనలో ఉందని పార్టీ క్యాడర్ ప్రగాఢ విశ్వాసం.

# 9 కోట్ల 59 లక్షల మిగులు అంచనాలతో జగ్గయ్యపేట పురపాలక సంఘం బడ్జెట్ ఆమోదం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట మార్చి 24 మనం న్యూస్ జగ్గయ్యపేట పురపాలక సంఘం 2025 -26 వ సంవత్సరం కు సంబంధించి తొమ్మిది కోట్ల యాభై తొమ్మిది లక్షల 75 వేల 560 రూపాయల మిగులు అంచనాలతో బడ్జెట్ను కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన బడ్జెట్ ప్రత్యేక సమావేశంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బడ్జెట్ కు సంబంధించి తొలిసారిగా బ్యాగులో బడ్జెట్ పత్రాలను కౌన్సిల్ కు తీసుకొని వచ్చి ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కు కమిషనర్ రామ్ మోహన్ రావు అందించారు.

### బడ్జెట్ అంచనాలు

2025- 26 సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నుల వసూళ్ల రూపన ఆరు కోట్ల 50 లక్షలు, షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలద్వారా 65 లక్షలు, నీటి పన్నుల వసూళ్ల ద్వారా కోటి రూపాయలు, 15వ గ్రాంట్ నిధుల ద్వారా మూడు కోట్ల రూపాయలు, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాండ్ ద్వారా 15 లక్షలు, ఇతర గ్రాంటు ల ద్వారా 13 కోట్లు, పట్టణ ప్రణాళిక ఆదాయం స్టాంప్ డ్యూటీ మరియు ఇతర ఆదాయాల ద్వారా ఏడు కోట్ల 96 లక్షల 92, వేల800, మొత్తం ఆదాయంగా 32 కోట్ల 26 లక్షల 92, వేల800 రాగలరని అంచనాలుగా చూపారు. ఖర్చులుగా పారిశుద్ధ్య కార్మికులు 1,2, 3,ల వేతనం కింద నాలుగు కోట్ల 52 లక్షల 5 6 వేలు, నాన్ పిహెచ్సి వర్కర్లు మరియు డిపిఓ జూనియర్ అకౌంటెంట్ ఇతర వర్కర్ల వేతనాల కింద 97 లక్షల నలభై నాలుగు వేలు, విద్యుత్ బిల్లుల కింద రెండు కోట్ల 30 లక్షల రూపాయలు, ఆఫీస్ మెయింటినెన్స్ కింద ఒక కోటి 60 వేలు, మున్సిపాలిటీ సాధారణ నిధుల నుండి అభివృద్ధి పనుల కోసం 13 కోట్ల 65 లక్షల 33 వే ల465 రూపాయలు, వాటర్ మెయిన్ టి నేమ్స్ చార్జీల కింద 21 లక్షల 23 వేల775 రూపాయలు, మొత్తం ఖర్చులుగా 22 కోట్ల 67 లక్షల 17 వేల 240 చూపారు, రాబడిలో ఖర్చులు పోను 9 కోట్ల 59 లక్షల 75 వేల 560 రూపాయలు మిగులుగా బడ్జెట్ అంచనాలలో చూపారు.

# జగ్గయ్యపేట కౌన్సిల్ సమావేశంలో తీవ్ర వాగ్వివాదం

## అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు చైర్మన్ పోడీఎం ముందు బైఠాయింపు

## వైయస్సార్ కాంగ్రెస్ తెలుగుదేశం సభ్యుల మధ్యవాగ్వివాదం





జగ్గయ్యపేట మార్చి 24 మనం న్యూస్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం లో వైయస్సార్ కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒకానొక దశలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులను రెండు నెలల పాటు బహిష్కరించాలని కమిషనర్ కు ఆదేశాలను జారీ చేశారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచనతో సస్పెన్షన్ను ఉపసంహరించుకుంటున్నట్లు చైర్మన్ రాఘవేంద్ర ప్రకటించారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ కౌన్సిల్ సమావేశానికి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశంలో వైస్సార్సీపీ సభ్యులు వైస్ చైర్మన్ హాఫీ జున్నిస, ఐదో వార్డ్ సభ్యులు వట్టెం మనోహర్, కో ఆప్షన్ సభ్యురాలు బషీ రున్నేసా లు పట్టణంలో యదేచ్ఛగా జరుగుతున్న అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అక్రమ లే అవుట్ల ఫోటోలను ప్రదర్శిస్తూ చైర్మన్ పోడియం ముందు బైఠాయించారు. చైర్మన్ రాఘవేంద్ర సమాధానమిస్తూ అక్రమ లే అవుట్లపై ఆ సర్వే నంబర్లను రిజిస్టర్ చేయవద్దని సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కమిషనర్ను ఆదేశించారు. అక్రమ లే అవుట్ లలో బోర్డులను పాతాలని రిజిస్ట్రేషన్లు నిలుపు చేయాలని డిమాండ్ చేస్తూ వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ కల్పించుకొని అక్రమ లే అవుట్లపైరిజిస్ట్రేషన్లు నిలుపువేయాలని ప్రభుత్వం జీవో ఇవ్వాలని రిజిస్టర్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు ఆపితే ప్రభుత్వ ఆదాయానికి అవరోధమని దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళదామని అన్నారు. వైసిపి సభ్యులు శాంతించక నినాదాలు చేస్తుండటంతో తెలుగుదేశం సభ్యులు పేరం సైదేశ్వర రావు ,నకిరేకంటి వెంకట్, సామినేని మనోహర్ తదితరులు గత కొన్ని సంవత్సరాలుగా ఏమీ మాట్లాడని సభ్యులు ఇప్పుడు హఠాత్తుగా నిద్రలేచి ఈ అంశంపై మాట్లాడుతున్నారని అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వచ్చాయన్న అక్కసు తో ఆటంకాలు కల్పిస్తున్నారని అన్నారు. పోడియం ముందు బైఠాయించినసభ్యులను సస్పెన్షన్ చేయాలని డిమాండ్ చేశారు. గత వైసిపి కౌన్సిల్ హయాంలో తాము చిన్న అంశానికి నిరసన తెలుపుతే నే పోలీసులను పిలిపించి తమను స్టేషన్కు తీసుకువెళ్లారని తెలుగుదేశం సభ్యులు కన్నెబోయిన రామలక్ష్మి తదితర మహిళా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై తెలుగుదేశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. వైసీపీ సభ్యులు పోడియం నుంచి లేవకపోతే తాము బయట ఇస్తామని దేశం హెచ్చరించారు.పలు మార్లు చైర్మన్ రాఘవేంద్ర వైసిపి సభ్యులను మీరు మీ స్థానాలలో కూర్చొని మాట్లాడాలని కోరినా వారు స్పందించకపోవడంతో చైర్మన్ రాఘవేంద్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఐదవ వార్డు కౌన్సిల్ సభ్యులు వట్టెం మనోహర్ తో సహా వైసిపి సభ్యులను రెండు నెలల పాటు సస్పెండ్ చేయాలని కమిషనర్ను ఆదేశించారు. ఈ దశలో ఎమ్మెల్యే రాజగోపాల్ కల్పించుకొని వైసీపీ సభ్యులకు సర్ది చెప్పి ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అప్పటిదాకా మున్సిపాలిటీ ద్వారా చేయాల్సిన పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తా ను హాజరైన సమావేశంలో సస్పెన్షన్లు ఉండటం సమంజసం కాదని వైసిపి సభ్యులపై సస్పెన్షన్ను ఉపసంహరించుకోవాలని చైర్మన్ రాఘవేంద్రకు సూచించారు. సమావేశం ప్రారంభంలో కోట్లాది రూపాయలనిధులతో చేపట్టే పనులలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్లర్ల వార్డులలో పనులలో అన్యాయం జరుగుతోందని ఐదవ వార్డు సభ్యులు వట్టెం మనోహర్ ఆరోపించారు. చైర్మన్ రాఘవేంద్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీ సమావేశంలో లా మాట్లాడవద్దని అభివృద్ధి నిధులు అన్ని వార్డులకు సమానంగా కేటాయిస్తున్నామని అన్నారు. ఈ విషయంపై ఐదో వార్డు సభ్యులు వట్టెం మనోహర్ పార్టీ చొక్కా వేసుకొని మీరు సమావేశంలో పాల్గొనడం లేదా అనే ప్రశ్నించడంతో చైర్మన్ రాఘవేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై చైర్మన్ రాఘవేంద్ర, వైసిపి సభ్యులు వట్టెం మనోహర్ల మధ్య వాగ్వివాదం జరిగింది.వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ 9 కోట్ల రూపాయల నిధులతో చేపట్టే పనులు అధికారులు చేస్తారా కాంట్రాక్టర్లతో చేయిస్తారా అని ప్రశ్నించారు. పనులు చేయించడంలో అధికారులు లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎవరికీ పనుల పట్ల శ్రద్ధ లేదని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించ కుండ కొందరు అధికారులు బదిలీపై వెళ్లి సంతకాలు పెట్టాలంటే కమిషన్లు కావాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కోరారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర సమాధానమిస్తూ బదిలీపై వెళ్లిన అధికారుల జీతాలు ఆపేలా చర్యలు తీసుకున్నామని వారు జరిగిన పనులపై బిల్లులు చేసే వరకు వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో గతంలో జరిగిన పనులకుఅధికారులు బిల్లులు చెల్లించకపోవడంతో ఎంతోమంది కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని మార్చి నెల ముగుస్తున్నందున జరిగిన పనులను నమోదు చేయాలని కౌన్సిల్ సభ్యులు పి రోశయ్య కోరారు. పట్టణంలోని పలు రోడ్లలో వేగంగా వాహనాలు వస్తూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని రెండవ వార్డు సభ్యులు కొలగాని రాము కౌన్సిల్లో కోరారు.

# ప్రపంచ క్షయ వ్యాది నిర్ములన వారోత్సవం




పోలవరం, మార్చి 25(మనం న్యూస్): మండలంలో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి సూపర్నెండెంట్ పూనెం రాంబాబు దొర ఆధ్వర్యంలో ప్రభుత్వ క్షయ వ్యాధి నిర్ములన వారోత్సవాలను నిర్వహించారు.చివరి రోజు సోమవారం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన ర్యాలీ నిర్వహించిప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సూపర్టెంట్ రాంబాబు మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు మనిషి బరువు తగ్గుట ఉమ్ము ద్వారా రక్తం పడుట రెండు వారాలు నుంచి దగ్గు తగ్గపోవడం నోటి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుందని,ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణం మీదకు తెస్తుందన్నారు. ఈ వ్యాధికి కళ్లెం వేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ మందులు ఉచితంగా అందిస్తుందని క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు. టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం నిమిత్తం నెలకు వెయ్యి రూపాయలు చొప్పున ఆరు నెలలపాటు జాతీయ పోషణ యోజన పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్నయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపర్నెంట్ పూనెం రాంబాబు దొర, ఆసుపత్రి వైద్యులు.సూపర్వైజర్ వాడపల్లి రాంబాబు ఎల్ టి రాజు ల్యాబ్ సూపర్ వైజర్ రవి సింగ్, ఆసుపత్రి సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఆర్థిక సంవత్సరం కోసం గోద్రేజ్ జెర్సీ కొత్త వ్యూహం




గాంధీనగర్ మార్చ్ 24 మనం న్యూస్: దక్షిణాది పాడి పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న గోద్రేజ్ జెర్సీ, 2026 ఆర్థిక సంవత్సరం కోసం దాని సరికొత్త 3బై3 లీప్ఫ్రాగ్ వ్యూహాన్ని ఆవిష్కరించింది. ఈ ముందస్తు ఆలోచనాత్మక చొరవ కంపెనీ ఉత్పత్తి శ్రేణిని విస్తరించడం, విస్తృత స్థాయిలో మార్కెట్లోకి చొచ్చుకుపోవడాన్ని ప్రోత్సహించడం, నిరంతర ఆవిష్కరణల ద్వారా వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. బాదం మిల్క్, పనీర్, పెరుగు అనే మూడు ప్రధాన ఉత్పత్తులపై దృష్టి సారించడం ద్వారా గోద్రేజ్ జెర్సీ పాల విలువ ఆధారిత పోర్ట్ఫోలియోలో ఆధిపత్య శక్తిగా ఎదిగేందుకు తన ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటోంది. మరిన్ని ఎక్కువ నివాసాలకు చేరడం, మార్కెట్ విస్తరణ, ఉత్పత్తి ఆవిష్కరణ అనే మూడు ప్రాథమిక లక్ష్యాలతో ఈ వ్యూహాన్ని అమలు చేస్తామని గోద్రేజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి తెలిపారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

# మెడలో చెప్పులు వేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలి.

### వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల నిరసన



జగ్గయ్యపేట మార్చి 24 మనం న్యూస్ రెండు రోజులు క్రితం రాజ్యాంగ నిర్మాతకి తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం నియోజకవర్గం, నల్లజర్ల మండలం, దూబచర్ల గ్రామం, గాంధీ కాలనీలో అంబేద్కర్ గారి విగ్రహానికి దుండగులు చెప్పుల దండ వేయటం పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేతలు నిరసన వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ నందు ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థాన మాజీ డైరెక్టర్ నంబూరి రవి, కన్నమాల శామ్యూల్, మండల మహిళా విభాగా అధ్యక్షురాలు చల్లా సుశీల, లాహెూరీ బద్దు నాయక్ శీలం మంగారావు, కొండమూరి సన్నీ, బాణావత్తు రాజు, బిఎస్ఎన్ఎల్ రామారావు, కార్మిక విభాగ అధ్యక్షులు గంగోలు వినోద్, ప్రచార విభాగ అధ్యక్షులు గోగుల వెంకయ్య, దార్ల ప్రసన్నకుమార్, వాలంటీర్ విభాగ అధ్యక్షులు ఎం.డి ఇమ్రాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

### ఈ సందర్భంగా నేతలుమాట్లాడుతూ.

విజయవాడ నడిబొడ్డున ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి.. గౌరవించిన వ్యక్తి వై యస్ జగన్ రెడ్డి అని, శాంతి భద్రతలను నారా చంద్రబాబు నాయుడు గాలికొదిలేయడంతో, ఇష్టారీతిన ఇలా గుండాలు రెచ్చిపోతున్నారని అన్నారు.బిరాష్ట్రంలో శాంతిభద్రతకు చోటే లేదు, అంతా రెడ్ బుక్ రాజ్యాంగమే నడుస్తుందనీ ఒక పక్కన మహిళలకు రక్షణ లేదు, మరో పక్కన రాజ్యాంగ నిర్మాత మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకి రక్షణ లేకుండా పోయింద న్నారు.పూలదండవేసే చోట కక్షపూరితంగా చెప్పులు దండ వేసి అవమానపరిచారనీ మహనీయునికిచెప్పులు దండ వేసిన దుండగులు ఎవరైతే ఉన్నారో వాళ్ళని పట్టుకొని పోలీసు వారు శిక్షించి కఠిన చర్యలు తీసుకోవాలి అని నేతలు డిమాండ్ చేశారు.

# ప్రపంచ క్షయ వ్యాధి దినం సందర్భంగా నియంత్రణ అవగాహన ప్రదర్శన




విజయవాడ,మార్చి 24( మనం ప్రతినిధి)క్షయ వ్యాధి ప్రాణాంతక వ్యాధి కాదని నియంత్రణ మన చేతుల్లోనే ఉందని దాన్ని వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాతబస్తీ కొత్తపేట లోని షేక్ రాజా సాహెబ్ (ప్రసూతి) మినీ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు శాంతి కిరణ్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి దినం సందర్భంగా షేక్ రాజాసాహెబ్ ఆసుపత్రి వద్ద డాక్టరు శాంతి కిరణ్ పర్యవేక్షణలో క్షయ వ్యాధి నియంత్రణ అవగాహన ప్రదర్శన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీ వ్యాధి లక్షణాలు వ్యాప్తి చెందే విధానం వ్యాధి యొక్క చికిత్స విధానం పోషకాహారం గురించి వివరించారు అలాగే టీబీ రోగులకు ఔషధాలతో పాటుగా వారి పోషకాహారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా రోగుల బ్యాంకు ఖాతాల్లో వెయ్యి రూపాయలు జమ చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ సి డాక్టర్లు టీబీ యూనిట్ సిబ్బందితో పాటుగా ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిరామ్ , డాక్టర్ వాణిశ్రీ , డాక్టర్ గౌస్ భాషా , డాక్టర్ స్రవంతి , పీజీ డాక్టర్లు, కొత్తపేట డౌన్ యు పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మ నాగేంద్రరావు, ఎన్ టి ఈ పి సిబ్బంది ట్రీట్మెంట్ సూపర్వైజర్ ప్రాన్సిస్, ల్యాబ్ సూపర్వైజర్ జోసెఫ్ తంబి, టిబి హెల్త్ విజిటర్స్ లలిత కుమారి, రమీజా, ల్యాబ్ టెక్నీషియన్ బాజీ ప్రసాద్, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ. 101 నుంచి ప్రారంభమయ్యే వి ప్యాక్ లతో నాన్-స్టాప్ క్రికెట్

గాంధీనగర్ మార్చ్ 24 మనం న్యూస్: టీ20 లీగ్ లో తలపడే జట్ల మధ్య మ్యాచ్ల స్ట్రీమింగ్ ను నిరాటంకంగా వీక్షించాలంటే వేగవంతమైన, తగినంత డేటా అవసరమవుతుంది. ఇప్పుడు వి ప్రీపెయిడ్ కస్టమర్లు అసామాన్యమైన డేటా అనుభూతి, జియో హాట్ స్టార్ బండిల్డ్ ఫ్రీ సబ్స్క్రిప్షన్ తో ఈ మ్యాచ్ లను ప్రతీక్షణం ఆస్వాదించవచ్చు. ప్రస్తుత సీజన్ కోసం వి ప్రత్యేకంగా మూడు కొత్త రీచార్జిలను ఆవిష్కరించింది. రూ. 101 రీచార్జ్ తో ఇది 5 జీబీ డేటాతో పాటు మూడు నెలల పాటు జియో హాట్ స్టార్ (మొబైల్) సబ్స్క్రిప్షన్ అందిస్తుంది. రూ. 399 రీచార్జితో అన్ లిమిటెడ్ కాల్స్, మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అన్ లిమిటెడ్ డేటా, అదనంగా 2 జీబీ డైలీ డేటా, జియోహాట్ స్టార్ మొబైల్ సబ్స్క్రిప్షన్, 28 రోజుల వేలిడిటీ లభిస్తాయి. రూ. 239 రీచార్జితో అన్ లిమిటెడ్ కాల్స్, 2 జీబీ డేటా, జియోహాట్ స్టార్ మొబైల్ సబ్స్క్రిప్షన్, 28 రోజుల వేలిడిటీ డేటా ప్రయోజనాలతో పాటు జియోహాట్ స్టార్ సబ్స్క్రిప్షన్ లభిస్తుంది.

# గొల్లప్రోలు సమస్యలు పరిష్కరించాలి

## పాడా ( పి ఏ డి ఏ ) పీ డి కి స్వచ్ఛ గొల్లప్రోలు సభ్యుల వినతి





గొల్లప్రోలు మార్చి 24. మనం న్యూస్. గొల్లప్రోలు పట్టణ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ పిడికి స్వచ్ఛ గొల్లప్రోలు సభ్యులు వినతిపత్రం అందజేశారు. పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో పిడి చైత్ర వర్షిణిని కలిసి స్వచ్ఛ గొల్లప్రోలు సభ్యులు సమస్యలు వివరించారు. గొల్లప్రోలు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రైన్ లు ఆధునీకరించి వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అర్ధాంతరంగా నిలిచిపోయిన సూర్యుడు చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు మరలా ప్రారంభించి పనులు పూర్తి చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారి సౌకర్యం కోసం సులబ్ కాంప్లెక్స్ లు నిర్మించాలని, బైపాస్ రోడ్డు నుండి పట్టణం మీదుగా తిరిగి బైపాస్ చేరేవరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని, నగర పంచాయతీ గ్రంథాలయం పునరుద్ధరించాలని, పట్టణ పరిధిలోని ఏడు సచివాలయాలకు సర్వేయర్ లను నియమించాలని, పొలాల నుండి పంటను తీసుకువచ్చేందుకు వీలుగా పుంత రోడ్లు నిర్మించాలని, శిథిలావస్థలో ఉన్న కలింగల్ లు, రెగ్యులేటర్లకు మరమ్మతులు నిర్వహించడంతో పాటు ఏలేరు, పిబిసి కాలువలకు పడిన గండ్లను పూడ్చి వేయాలని పిడిని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, సభ్యులు కొమ్ము సత్యనారాయణ, పెదిరెడ్ల వెంకట్రాజు, కర్రి కొండలరావు, కీర్తి ఆదినారాయణ, చోడపునీడి పుల్లపురాజు, జ్యోతుల శివ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ హామీలు గాలికొదిలారు

## రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ప్రదాన కార్యదర్శి కర్రా జయ సరిత.



పాలకొల్లు, మార్చి 24,మనం ప్రతినిధి :సూపర్ సిక్స్ హామీలు గాలికొదిలారు అని రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ప్రదాన కార్యదర్శి కర్రా జయ సరిత ధ్వజ మెత్తారు.పాలకొల్లు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్రెడ్డి పై బాడీ షేమింగ్ వెకిలి కామెడీ ఛీప్ స్క్రిప్ట్ లతో వాడు, వీడు అంటూ చెసిన కూటమి ప్రభుత్వం పై స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ప్రదాన కార్యదర్శి కర్రా జయ సరిత అన్నారు.ఈ సమావేశంలో జోగి వెంకటేశ్వరరావు ,జోగాడ ఉమామహేశ్వరరావు.,పెచ్చేటి కృష్ణాజి , మామిడి శెట్టి చిట్టిబాబు, రామాంజుల చిన మదు ,గొర్రెల రాంబాబు , జక్కంశెట్టి వెంకట రెడ్డి , వీరా మల్లికార్జునుడు ,, పెచ్చేటి నాగేంద్ర వర ప్రసాద్ ,గంగిరెడ్ల ప్రసాద్ హైమావతి, కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ అదనపు భవన నిర్మాణానికి సిమెంట్ బస్తాల వితరణ



పాలకొల్లు, మార్చి 24,, మనం ప్రతినిధి:పాలకొల్లు పట్టణంలోని భవన నిర్మాణానికి రాష్ట్ర వైసీపీ నాయకులు కర్ర జై చరిత సిమెంట్ బస్తాలను సోమవారం వితరణగా అందజేశారు. రాబోయే కాలంలో అవసరమైన సహకారం అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విన్న కోట వెంకటరమణ, కార్యదర్శి ఎం ఎన్ వి సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, రాష్ట్ర నాయకులు ముత్యాల శ్రీనివాస్, జోగాడ ఉమామహేశ్వరరావు,జోగి వెంకటేశ్వరరావు,రామానుజుల చిన్న మధు,గంగిరెడ్ల ప్రసాద్, కే గోపాలరావు, అప్పలరాజు హైమావతి,ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## శామ్‌సంగ్ బెస్పోక్ ఏఐ డిజిటల్ ఉపకరణాలపై ప్రత్యేక పండుగ ఆఫర్లు




గాంధీనగర్ మార్చ్ 24 మనం న్యూస్: భారతదేశపు అగ్రగామి వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్.. ఉగాది, గుడి పాడ్వా, ఈద్ పండుగలను ప్రత్యేక ఆఫర్లతో జరుపుకుంటోంది. ఏఐ ఆధారిత రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లు, ఎయిర్ కండిషనర్లు, మైక్రోవేవ్‌లు ఇప్పుడు అద్భుతమైన డీల్స్‌తో అందుబాటులో ఉన్నాయి. శ్రేయస్సు, కొత్త ప్రారంభాలను స్వాగతించడానికి సిద్ధమవుతున్న ఈ తరుణంలో, మీ ఇంటిని స్మార్ట్, మరింత కనెక్ట్ చేయబడిన ఉపకరణాలతో నవీకరించుకోవడానికి ఇది ఉత్తమ సమయం. ఈ పరిమిత కాలపు ఆఫర్లు ఈ నెల 31 వరకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

## ఎస్సి వర్గీకరణ రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం

**-మాలల సంక్షేమ అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెన్నెం సుధాకర్**



గాంధీనగర్ మార్చ్ 24 మనం న్యూస్ ఎస్సి వర్గీకరణ రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని మాలల సంక్షేమ అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెన్నెం సుధాకర్ స్పష్టం చేశారు. సోమవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తుందని విమర్శించారు. ఎస్సి వర్గీకరణ ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. అందుకు తగ్గ ఫలితం కూటమి ప్రభుత్వం అనుభవించక తప్పదని హెచ్చరించారు. వర్గీకరణను మాలల సంక్షేమ అభివృద్ధి సంఘం ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని అవసరమైతే ప్రాణ త్యాగానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. అశాస్త్రీయం గా చేసిన ఎస్సి వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు నాగేల్ల కరుణాకర్, పల్లోలి ఓబులేసు, ఎస్ లింగం, పసల పెద్ద వెంకటేశ్వర్లు, గుర్రం సామెల్, మేకల యేసు, మాసి సాగర్, ఉస్తల కాశీ, సింహం రత్నమయ్య, కమటం నాగేష్, ఎం.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో క్షయ వ్యాధి అవగాహన ర్యాలీ




జగ్గయ్యపేట మార్చి 24 మనం న్యూస్ ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలో నీ కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్ లో అవగాహన ర్యాలీ మరియు సదస్సును నిర్వహించారు. వైద్యశాల ఇన్చార్జి సూపరింటెంట్ నాగరాణి ఆధ్వర్యంలో వైద్యులు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు అనంతరం జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్లు నాగరాణి , శైల, వాసంతి తదితరులు మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలను ఎలా వస్తుంది చికిత్స విధానం పోషకాహారం తదితర అంశాలను వివరించారు. డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా తెమడను పరీక్ష చేయించుకోవాలని తెలియజేశారు. వైద్యశాలలో కళ్ళే పరీక్ష మరియు ఎక్సరే తీసి రోగ నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు మందులను ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు సూపర్వైజర్లు ఏఎన్ఎంలు, ఆషా లు,టిబి సూపర్నెంట్ నాగరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు సర్వ మత సామరస్యాన్ని పరిమళింపజేస్తాయి

**రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనది. షేక్ వలియా బిలాల్ మస్జీద్ గౌరవ అధ్యక్షులు.**



ఆత్రేయపురం మార్చి 24 మనం న్యూస్. పవిత్ర రంజాన్ మాసంలో అల్లాను ప్రార్థిస్తూ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో పుణ్య కార్యమని, మనిషి సత్ప్రవర్తనతో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయని, సర్వమతాల సారాంశం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాల యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని షేక్ వలియా బిలాల్ మస్జీద్ గౌరవ అధ్యక్షులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక హై-స్కూల్ సెంటర్ వద్ద గల మస్జీద్ నందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మత సామరస్యానికి అర్థంపట్టేలా గ్రామంలో గల హిందూ, క్రైస్తవ సోదరులను ఆహ్వానించి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జమాత్ ఏ ఇస్లామి హింద్ సెక్రటరీ సమీర్, స్థానిక ముస్లిం పెద్దలు మహమూద్ షరీఫ్ బాబ్జి గౌస్, ఆదాము, తాసు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు





రావులపాలెం మార్చి 24 మనం న్యూస్. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో రావులపాలెం బస్ డిపో కు నూతనంగా సమకూర్చిన రెండు అల్ట్రా డీలక్స్ బస్సులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఈ బస్సులను సాలూరు, భద్రాచలం రూటుకు కేటాయించారని తెలిపారు. అలాగే త్వరలో రెండు వెన్నెల ఏసీ స్లీపర్ బస్సులు కూడా అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, జక్కంపూడి వెంకటస్వామి, మైగపుల గురవయ్య నాయుడు, నందం సత్యనారాయణ, ధరణాల రామకృష్ణ, కోట వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ట్రైని ఐపిఎస్ మనీషా రెడ్డి**

## జగ్గయ్యపేట మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ.




జగ్గయ్యపేట మార్చి 24 మనం న్యూస్‌స్వతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐలు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ సదస్సు నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని మార్కెట్ యార్డ్ నుండి ప్రారంభమై కమల సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు కళాశాల విద్యార్థులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, వివిధ ప్రజాసంఘాల నాయకులతో ఈ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లై కార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉక్కు కళా వేదికలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్ ప్రణయ్ తేజ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు భగత్ సింగ్ చిత్రపటానికి ట్రైనీ ఐపీఎస్ అధికారిని మనిషా రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనిషా రెడ్డి మాట్లాడుతూ భగత్ సింగ్ 23 సంవత్సరాల వయసులోనే దేశం కొరకు ఉరి కంబాన్ని ముద్దాడారని, విద్యార్థి దశ నుండే విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలి అన్నారు. యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని డ్రగ్స్ వినియోగం జీవితాన్ని నాశనం చేస్తుంది అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థిలో ఏదో ఒక స్కిల్ ఉంటుందని దాన్ని గుర్తించి ముందుకెళ్లి లక్ష్యాన్ని చేరుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు అన్నారు. ఐద్వా నాయకులు ఎస్ నాగమణి, విశ్వ భారతి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జల్లా తిరుపతిరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారినపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని కాలాన్ని వృధా చేసుకోకుండా లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగాల భర్తీ చేయడంతో పాటు డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాటం చేస్తుందన్నారు. భారతదేశంలో ఉన్న యువత ఏ దేశంలో కూడా లేదని, యువత సరైన మార్గంలోకి వెళ్లి పనిచేస్తే దేశం దానంతటదే అభివృద్ధి చెందుతున్నారు. నేడు డ్రగ్స్ ను సేవించి తల్లి, చెల్లి, అక్క అనేది కూడా చూడకుండా నేడు వారిపై అఘాయిత్యాలు జరగటం దురదృష్టకరమన్నారు. మహిళలు, యువత, విద్యార్థులు ఏకతాటిపై నిలబడి పోరాడితే సాధించలేనిది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట సిఐ పి వెంకటేశ్వరరావు, చిల్లకల్లు ఎస్సై టి సూర్య శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, ఆలీ, ప్రజా సంఘాల నాయకులు ఎం సోమేశ్వరరావు, కె లింగారావు, షేక్ గౌస్ మియా, కె శ్రీనివాస్, దంతాల నరేంద్ర, కాకనబోయిన వెంకటేశ్వర రావు, కోటా రవికుమార్, షేక్ మీరా సాహెబ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## కుంకాల అనకట్ట ఎత్తు పెంచి రైతులకు సాగు నీరు అందించాలి

**వింజరంలో రేషన్ డిపో, కోయ నాగంపాలెంలో పాఠశాల నిర్మించాలి.**

**సి పి ఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మోడియం నాగమణి..**



పోలవరం,మార్చి 24(మనం న్యూస్):కుంకాల అనకట్ట ఎత్తుపెంచి రైతులకు సాగునీరు అందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి అన్నారు.సిపిఎం పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర రెండో రోజు మండలంలో పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ మండలంలోని రెడ్డి కుంకాల సమీపంలో నిర్మించిన అనకట్ట పూడిక తీయాలని సూచించారు.అనకట్ట ఎత్తు పెంచి రైతులందరికి సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.పేద్రాల నుంచి ఎల్ ఎన్ డి పేట వరకు ఉన్న మార్గంలో కొండ వాగులపై కల్వర్టు లేక ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే కొండ వాగులపై కల్వర్టు లను నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ మండలం లోని వింజరం గ్రామంలో 1989లో నిర్మించిన రేషన్ డిపో కేంద్రం పూర్తిగా పాడై పోయిందన్నారు. జీసీసి గోడౌన్ స్థలం ఉన్నా ప్రభుత్వం ఇప్పటికి భవన నిర్మాణానికి నిధులు కేటాయించక పోవడం బాధాకరం అన్నారు.ప్రభుత్వ ఇప్పటికైనా నిధులు కేటాయించి కొత్త భవనం నిర్మించి రేషన్ లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేయాలనీ అన్నారు. కోయ నాగంపాలెం గ్రామంలో విద్యార్థులు లేరని బడి మూసి వేశారని ప్రస్తుతం 10మంది రెండు కిలోమీటర్లు దూరం మణుగోపాల బడికి నడిచి వెళ్తున్నారని అన్నారు. గ్రామంలో ప్రభుత్వ బడిని నిర్మించి విద్యార్థులకు అందుబాటులో విద్యను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజా ఆందోళన చెపడతామని హెచ్చరించారు. ఈ యాత్రలో సిపిఎం నాయకులు పోలోజు నాగేశ్వర రావు, బొరగం భూచంద్ర రావు, చుంద్రు బుల్లెమ్మ, ఎస్. సాయి కృష్ణ, కె. భీమరాజు, శివ రమేష్, అనూష తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం.

- **దాదాపు రూ.5,400 కోట్లతో 2025-26 బడ్జెట్.**
- **హాజరైన టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడు, బోర్డు సభ్యులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, బోర్డు మెంబర్లు టీటీడీ అధికారులు.**



జగ్గంపేట,/తిరుమల, మార్చి 24:మనం న్యూస్ టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం తిరుమలలో జరిగింది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో టీటీడీ బోర్డు సభ్యులు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గతేడాది రూ. 5,141.74 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన టీటీడీ ఈ ఏడాదికి దాదాపు రూ.5,400 కోట్లతో పెట్టింది. ఇప్పటికే సిద్ధం చేసిన 30కి పైగా అజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించడంతో పాటు ముడిసరుకుల కొనుగోళ్లు, ఇంజనీరింగ్ పనులకు నిధుల కేటాయింపులపైనా సమావేశంలో తీర్మానాలు చేశారు. తిరుపతి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించేందుకు టిటిడి ఏర్పాట్లు చేస్తుంది. సీఎం సూచన మేరకు గ్రామీణ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం నూతన ట్రస్టు ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు. ప్రైవేటు బ్యాంకుల్లోని టీటీడీ డిపాజిట్లను జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు నిపుణుల కమిటీ సిఫారసులపైనా చర్చించారు. ఇక వేసవి సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపైనా చర్చించారు. అలిపిరిలో కొండలను అనుకుని ప్రైవేటు నిర్మాణాలు లేకుండా టెంపుల్ కారిడార్‌గా చేసే అంశంపైనా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఈవో శ్యామల రావు, జేఈవో, టిటిడి పాలక మండలి సభ్యులు, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డి ఈ ఓ



కాట్రేనికోన మార్చి 24 మనం న్యూస్ కాట్రేనికోన మండల పరిధిలో కాట్రేనికోన,చెయ్యరు గ్రామాలలోజిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం భాష పరిశీలించారు,మూడు పరీక్షా కేంద్రల్లో 574 మందివిద్యార్థినీ,విద్యార్థులు హాజరు కావలసి ఉండగా వారిలో 572 మంది పరీక్షలకుహాజరయ్యారు.చెయ్యేరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు పరీక్షలకు హాజరు కాలేదన్నారు ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి ఎమ్ వి రమణ తదితరులున్నారు

## పట్టుకోసమే ప్రజల్లోకి వర్మ.



గొల్లప్రోలు మార్చి24. మనం న్యూస్. పిఠాపురం నియోజకవర్గంలో ఇటీవల రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి జనసేన టిడిపి మధ్య ఆదిపత్య పోరు సాప కింద నీరులా విస్తరిస్తుంది ఇటీవలచిత్రాడలో జనసేన పార్టీ12వ.ఆవిర్భావ సభ వేడుకలను అత్యంత వైభవ్వేదంగా నిర్వహించిన సంగతి తెలిసిందే అదే సభ వేదికపై ఎమ్మెల్సీ నాగేంద్రబాబు చేసిన కామెంట్స్ పిఠాపురం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లోకలవరపాడు మొదలైంది అప్పటినుండే పిఠాపురం తెలుగుదేశం పార్టీ మాజీ శాసనసభ్యుడు ఎస్ వి ఎస్ ఎన్ వర్మ ప్రజల్లో పట్టు పెంచుకునేందుకు నియోజకవర్గంలోదూసుకుపోతున్నాడ ని పిఠాపురంలో తెలుగు తమ్ముళ్లు గట్టిగా వినిపిస్తున్న మాట దీనిలో భాగంగా నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి మాజీ ఎమ్మెల్యే వర్మ పెద్ద పి ట వేశారని చెప్పాలి మరి దీనిపై యు కొత్తపల్లి పిఠాపురం గొల్లప్రోలు మండలాలలో పట్టణ గ్రామీణ ప్రాంతాల టిడిపి కార్యకర్తలతో విస్తృతంగా ప్రజా సమస్యల పరిష్కారం ఆత్మీయ సమావేశాలు జోరుగా నిర్వహిస్తున్నారు అని తెలుగు తమ్ముళ్లు విస్తృతంగా ప్రసారం చేస్తున్నారు ముందు ముందు టిడిపి జనసేనల మధ్య ఎటువంటి రాజకీయ ప్రకంపనలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి మరి...

## ప్రైవేట్ వాహనాలు నిలుపుదలతో ప్రమాదాలకు అడ్డాగా హై-స్కూల్ సెంటర్



ఆత్రేయపురం మార్చి 24 మనం న్యూస్. మండల పరిధిలో ర్యాలి గ్రామ హై స్కూల్ ప్రధాన కూడలిలో నిరంతరం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రమాదాలకు కారణం ప్రధాన రహదారి కి ఒకవైపు చెత్త డంపింగ్, మరో ప్రక్క ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చెయ్యడం అని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఈ ప్రైవేటు వాహనాలు వేరేచోటకు మార్చాలని పలుమార్లు మొరపెట్టుకున్న వాహనదారులు పెడ చెవిన పెడుతున్నారు. గతంలో ఇదే ఏరియా లో చిట్టూరి సౌమ్య( 9సం,) రోడ్డు పక్కన ప్రైవేటు వాహనాలు ఉండడంతో ఎటూ తప్పుకోలేని కారణంగా ఆ చిన్నారి చనిపోయింది. ఈ నాలుగు రోడ్ల కూడలిలో ప్రతిరోజు సుమారు 650 మంది విద్యార్థిని విద్యార్థులు స్కూల్, కాలేజీ కి నడిచి వెళుతుంటారు. అదే సమయంలో పెద్ద, పెద్ద ఇసుక లారీలు వేగంగా వస్తూ ఉంటాయి. ఈ ప్రైవేట్ వాహనాల వల్ల సెంటర్లో ప్రమాదాల ఘంటికలు మోగుతున్నాయి. అలాగే హై-స్కూల్ సెంటర్ నుండి పంచాయితీ నిర్మించిన ప్రధాన మురుగు కాలువ పై బల్లలు వేసి మురుగు కాలువ పైనుండి డ్రైన్ దాటి రోడ్డువరకు వచ్చి వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో వినియోగదారులు రోడ్డుపై వాహనాలు నిలిపుతుంటారు. దానితో వచ్చే, పోయే వాహనాలకు ఇబ్బందికరంగా మాడంతో యాక్సిడెంట్లు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ మలుపులో ప్రైవేటు వాహనాలు నిలిపివేయడం వల్ల ఎదురుగా వచ్చే వాహనం చిన్నదా పెద్దదా అవగాహన లేక పోవడంతో నిరంతరం ఈ ప్రమాదపు మలుపు యాక్సిడెంట్ కి అడ్డగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎటువంటి రాజకీయ, పుట్టినరోజు ఫ్లెక్సీలు ఏర్పాటు చెయ్యడానికి, వాహనాలు నిలిపి వేయడానికి అవకాశం ఇవ్వకుండా పంచాయతీ అధికారి తక్షణమే చర్యలు చేపట్టాలని శనివారం గ్రామపంచాయతీ అధికారి కె.కృష్ణమాచార్యులుకు, స్థానిక పూలే అంబేద్కర్ ఆశయ సాధన సమితి అధ్యక్షులు మంగం లక్ష్మణరావు , వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పురుగుల మందు కలిపారని గ్రీవెన్స్ లో ఫిర్యాదు



కాట్రేనికోన మార్చి 24 మనం న్యూస్ లీజుదారుడికి,రైతుకి విభేదాలు రావడంతో చెరువులలోపురుగుమందు కలిపారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జరిగిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసినట్టు లీజు దారుడు కాట్రేనికోన గ్రామానికి చెందిన చింతా దుర్గా ప్రసాద్ తెలిపారు,లీజుదారుడు దుర్గా ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం కాట్రేనికోన పంచాయతీ పరిధిలో 11 ఎకరాల భూమిని ఐదు సంవత్సరాలు పాటు లీజుకి తీసుకున్నానని,లీజు వ్యవధి ఉండగా చెరువులో పురుగు ముందు కలపటంతో సుమారు 15 లక్షల రూపాయలు ఆర్థికంగా నష్టపోయానని ఫిర్యాదులో పేర్కొన్నాడు,చెరువు దగ్గర ఉన్న 20 బస్తాల మేత,ఆరు ఇంజన్ లు తీసుకుని పోయారని బాధితుడు ఆరోపించారు,ఫిర్యాదుపై విచారణ చేసి చెరువులలో లీజు వ్యవధి ఉండగా పురుగు మందు కలిపిన రైతులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, తనకు జరిగిన అన్యాయం పై విచారణ చేసి తనకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు,

మనం

మంగళవారం 25 - 03 - 2025

# దళితులకు స్మశాన వాటిక కేటాయించాలి

**ఆచంట నియోజవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణ కి వినతి పత్రం**

**అందజేసిన మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్.**



పెనుమంట్ర మార్చి 24 మనం న్యూస్ : పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామంలో దశాబ్దాల కాలంగా దళితులకు స్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ అన్నారు ఈ సందర్భంగా శాసనసభ్యులు పితాని సత్యనారాయణకి ఓడూరు సంబంధించి గట్టుపై దళితుల సమాధులు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం పయనించాలని గతంలో మూడు రోజులు పాటు దీక్షలు చేశామని అధికారులు స్పందించి తాత్కాలికంగా గట్టును చూపించారు తప్ప ఇప్పటి వరకు స్మశాన వాటికకు స్థలం ప్రభుత్వం కేటాయించకపోవడం దారుణమని నియోజవర్గ ఎమ్మెల్యే వీటిపై స్పందించాలని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి దళితులకు స్మశాన వాటికను కేటాయించేలా కృషి చేయాలని అన్నారు ఈ సందర్భంగా పితానిసత్యనారాయణ మాట్లాడుతూ శాశ్వత పరిష్కారం దిశగా స్థలం కేటాయించి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోలాటి ప్రసాదరావు పెనుమంట్ర మండల అధ్యక్షులు కుసుమే వెంకటేశ్వరరావు, విప్పర్తి శ్రీను, పెదపూడి రాజారావు, మాత వెంకటేశ్వర్లు, ఏలేటి చిట్టిబాబు, కోట నాగేంద్ర, సాక శ్రీను , మురాల ధర్మరాజు, బత్తిన మధు, గడ్డం రామారావు, పలివెల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

# ప్రజలు క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలి

**వైద్య అధికారిని డాక్టర్ జి సుప్రజ.**



పోదూరు మార్చి 24 మనం న్యూస్ : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవము సంధర్భముగా సోమవారం పోదూరు ప్రాధమిక ఆరోగ్య కేంద్రము నుండి గ్రామ వ్యాప్తంగా అవగాహన ర్యాలీ చేసిన తదనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా. డి.సుప్రజ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డా. డి.సుప్రజ మాట్లాడుతూ ప్రజలందరికీ క్షయ వ్యాధి పట్ల అవహాగాహన కలిగి ఉండాలని, జ్వరము, ఆకలి లేకపోవటం, రెండు వారాలు మించి దగ్గు, బరువు తగ్గటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాధమిక ఆరోగ్య కేంద్రము వద్దకు వచ్చి కళ్లే పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం మందులను పూర్తిగా ఉచితముగా అందచేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమములో సూపర్ వైజర్ లు, ఏఎన్ఎం లు , ఆశా కార్యకర్తలు, తదితరు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్ లో పేదలకు అన్నదానం.



జగ్గంపేట మార్చి 24:మనం న్యూస్. జగ్గంపేట స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత మూడు సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ కు జగ్గంపేట గ్రామానికి చెందిన కీర్తిశేషులు మీసాల వెంకట్రావు మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు మీసాల రాఘవేంద్రరావు, మీసాల సత్యనారాయణ ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ అన్నా క్యాంటీన్ ను రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షుడు మారిశెట్టి భద్రం ముఖ్యఅతిథిలుగా హాజరై అన్నా క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చాలని తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ స్ఫూర్తితో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ జగ్గంపేటలో గత మూడు సంవత్సరాలుగా దాతల సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని ఈరోజు మీసాల రాఘవేంద్రరావు, సత్యనారాయణ ఆర్థిక సాయంతో 500 మందికి అన్నదానం నిర్వహించామని ప్రభుత్వం జగ్గంపేటలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసే వరకు దాతల సహకారంతో కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, వేములకొండ జోగారావు, యల్లమిల్లి సీఎం, దేగల సత్తిబాబు, బద్ది సురేష్, కోడూరి రమేష్, మారిశెట్టి గంగ, ఎస్ వి వి సత్యనారాయణ, కే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకే స్కౌట్ అండ్ గైడ్స్



కాట్రేనికోన మార్చి 24 మనం న్యూస్ భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ పెంపొందించడానికి అవకాశం ఏర్పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. స్థానిక శ్రీనివాస ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ పెట్రోల్ లీడర్స్ ట్రైనింగ్‌ను డీఈవో డాక్టర్ సలీం బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పెట్రోల్ లీడర్స్ ట్రైనింగ్‌ను విద్యార్థులు సమర్థవంతంగా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో మంచి స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులుగా అభివృద్ధి చెందుతారన్నారు. అలాగే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి పెట్రోల్ లీడర్స్ ట్రైనింగ్ ఎంతగానో దోహదపడుతుందని డీఈవో డాక్టర్ బాషా తెలిపారు. ట్రైనింగ్ కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలోని 26 పీఎంశ్రీ పాఠశాలల నుంచి 186 మంది విద్యార్థులు పెట్రోల్ లీడర్స్ ట్రైనింగ్ పొందుతున్నట్లు తెలిపారు. ఒక్కో పాఠశాల నుంచి నలుగురు వంతున స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులు పెట్రోల్ లీడర్ ట్రైనింగ్ పొందతున్నారన్నారు. స్కౌట్ అండ్ గైడ్ పతాకాన్ని డీఈవో డాక్టర్ సలీం బాషా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, స్కౌట్ టీచర్స్ లీడర్ ఆఫ్ ట్రైనింగ్ ఎం.హరీష్‌కుమార్, గైడ్ కెప్టెన్ లీడర్ ఆఫ్ ట్రైనీ సుగుణారాజేంద్రన్, అసిస్టెంట్ లీడర్ ఆఫ్ ట్రైనీ సుబ్బలక్ష్మి, గైడ్ కెప్టెన్ అడ్వాన్స్‌డ్ దుర్గామాధవి, స్కౌట్ మాస్టర్స్ అడ్వాన్స్‌డ్ జేఎన్ఎస్ గోపాలకృష్ణ, కట్టా కృష్ణప్రసాద్, జి.సుబ్బరాజు, జానకిరామ్, చిత్తరంజన్‌దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిని తరిమేద్దాం

**ఆధునిక చికిత్స అందుబాటులో**





రావులపాలెం మార్చి 24 మనం న్యూస్. క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ సమిష్టిగా కృషి దేశం నుంచి తరిమి కొట్టాలని ఊబలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ డాక్టర్ షకీనా అన్నారు. వారి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా క్షయ నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలను, రోగులకు అందించాల్సిన చికిత్స విధానాన్ని స్థానిక రోగులకు వివరించారు. ఈ సందర్భంగా రెండు వారాలకు పైబడి జ్వరం బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఉన్నట్లయితే క్షయ వ్యాధి అనుమానుతునిగా గుర్తించి వెంటనే కళ్ళ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే మందులు పూర్తిగా ఉచితం తో పాటు రోగికి ఆహారం నిమిత్తం నెలకు వెయ్యి రూపాయలు చొప్పున రోగి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. క్షయ వ్యాధి నివారణకు ఆధునిక చికిత్స అందుబాటులో ఉందని తెలియ జేశారు. పీహెచ్‌సీకి చెందిన వైద్యారోగ్య, ఆశ సిబ్బంది క్షయ వ్యాధి నివారణ ఆవశ్యకతను వివరిస్తూ గ్రామ పురవీధుల్లో బారీ ర్యాలీ నిర్వహించారు. క్షయను ఒడిద్దాం, దేశాన్ని గెలిపిద్దాం అంటూ నినాదాలు చేశారు. 2025 యేడాది చివరి నాటికి క్షయ ముక్తి భారత్‌ను నెలకొల్పుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ, పీహెచ్ఎన్, డిపిఎమ్ఓ, ఏపీఎంఓ, ఎంపీహెచ్ఈఓ, ఎం పి హెచ్ ఎస్, హెచ్ వి, సిహెచ్ఓ, ఎం పి హెచ్ ఏ, ఏఎన్ఎం, ఫార్మసిస్ట్, ఎల్ టి, ఎన్టిఈపి సిబ్బంది, ఆశాలు, టీబి సూపర్‌వైజర్ కె ఎస్ వి రమణ పాల్గొన్నారు.

# నాగులపల్లి లో క్షయ నివారణ ర్యాలీ



యు.కొత్తపల్లి మార్చి 24(మనం న్యూస్) నాగులపల్లి పిహెచ్సి సిబ్బంది ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్సీ వైద్యురాలు డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో సోమవారం నాగులపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాల కంటే దగ్గు, సాయంత్ర సమయాలలో జ్వరం బరువు తగ్గిపోవడం ఆకలి లేకుండా బరువు తగ్గడం ఉన్న విపరీతంగా తగ్గేటప్పుడు కళ్ళల్లో రక్తపు సారలు ఉండడం వల్ల క్షయ వ్యాధి ఉన్నట్లుగా నిర్ధారించవచ్చు అలాంటి వారు ఎవరైనా ఉంటే కళ్ల పరీక్ష చేయించుకుని దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సరోజినీ, హెచ్ ఈ గౌరీశ్వరి, హెచ్ఎస్ అప్పారావు, హెచ్ యు జ్యోతిరత్న కుమారి, ఎం పి హెచ్ ఎ గంగాధర శ్రీనివాస్ అలాగే ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు

# జాతీయ సాహిత్య సదస్సులో పత్ర సమర్పణకు ప్రశంసా పత్రం మరియు సత్కారం అందుకున్న బాలార్జున








అమలాపురం మార్చి 24 మనం ప్రతినిధి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం భాష సాంస్కృతిక శాఖ రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి సౌజన్యంతో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ బోయి భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ మరియు శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సాహిత్య సదస్సులో పద్మభూషణ్ డాక్టర్ భోయి భీమన్న రచనలు సామాజిక ప్రయోజకత్వం అనే అంశంపై తెలుగు భాష ఉపాధ్యాయుడు కవి వ్యాసకర్త వ్యాఖ్యాత బాలార్జున సత్యనారాయణ మాకే పరిశోధనా పత్రంను సమర్పించారు .రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాల్ లో నందు జరిగిన జాతీయ సాహిత్య సదస్సులో ఈ పత్రాన్ని సమర్పించారు.ఈ కార్యక్రమం శ్రీ శ్రీ కళావేదిక సియిఓ కత్తిమండ ప్రతాప్ సారధ్యంలో జరిగింది.కన్వీనర్ గా కొల్లి రమావతి సదస్సు సంచాలకులుగా డాక్టర్ టి పార్థసారథి సభాధ్యక్షులుగా జి.ఈశ్వరీ భూషణం వ్యాఖ్యతగా బాలార్జున ఈ సదస్సు నిర్వహించారు .కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోయి భీమన్న సతీమణి భీమన్న సాహితి నిధి ట్రస్ట్ చైర్మన్ శ్రీమతి బోయి హైమావతి హాజరయ్యారు. జాతీయస్థాయి సదస్సుకి విశిష్ట అతిధులుగా ప్రముఖ రాజకీయ నాయకులు నర్సిపల్లి హారిక విచ్చేసారు. బోయి భీమన్న కోనసీమలోని మామిడి కుదురు మండలం లో పేద కుటుంబంలో జన్మించి అసమానతలు వివక్షతలను ఎదుర్కొని అక్షరాన్ని ఆయుధంగా మలుచుకుని సామాజిక రుగ్మతలపై సమరం చేసిన అక్షర యోధుడిగా ఆయన కలం నుండి జాలువారిన అక్షరాలు ఆనాటి సామాజిక పరిస్థితులను సాంఘిక కట్టుబాట్లను చైతన్యపరిచి ఎందరినో అక్షరాస్యులు చేసి ఎందరో ఉన్నత జీవన గమనానికి వారి రచనలు చైతన్య స్ఫూర్తిని కలిగించాయని వారి రచనలు ఇప్పటికీ ఈ తరానికి స్ఫూర్తి దాయకమని వారి రచనల్లో సామాజిక చైతన్యం వెల్లివిరిసిందని మనుషులంతా ఒక్కటేనని మమతా సమతల సమానత్వ సాధనే సామాజిక అభ్యున్నతని సమ సమాజం విద్య ద్వారానే సాధించబడుతుందని తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచిన మహోన్నతులు కలంతో గళంతో సమాజానికి మార్గ నిర్దేశం చేసిన సాహితీ భూషణుడు పాలేరు నుండి పద్మభూషణ్ వరకు వారి ప్రగతి భావితరాలకు మార్గదర్శకమని పద్మశ్రీ ,కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్ లాంటి అత్యున్నత పురస్కారాలు సాధించిన వాసి మన కోనసీమ నివాసి కావడం కోనసీమ వాసులందరికీ గర్వకారణమని అలాంటి మహనీయుడి జీవిత రచనలను పరిశోధించడం పత్రం సమర్పించడం తనకు కలిగిన భాగ్యమని పత్ర సమర్పకులు బాలార్జున సత్యనారాయణ తెలియజేశారు.స్ఫూర్తిదాయకమైన పరిశోధనా పత్రంను సమర్పించినందుకు బాలార్జునకు బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి సియిఓ కత్తిమండ ప్రతాప్ రాజకీయవేత్త నర్సిపల్లి హారిక సమన్వయకర్త కొల్లి రమావతి జాతీయ అధ్యక్షులు ఈశ్వరీ భూషణం మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ అద్దంకి రాజయోనా ప్రోగ్రాం కోఆర్డినేటర్ నూకా సంపత్ కల్చరల్ వింగ్ డైరెక్టర్ దేబా విజయ కుమారులు ప్రశంసా పత్రం అభినందన జ్ఞాపిక అందించి శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు మరియు ఉపాధ్యాయులు బాలార్జునకు అభినందనలు అందజేశారు.

# వైసిపి పాలనలో 300 ఎకరాల్లో 50కోట్ల అవినీతి

**మాజీ ఎమ్మెల్యే వర్మ**



యు.కొత్తపల్లి మార్చి 24 (మనం న్యూస్) వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇల్లు ఇచ్చేందుకు జగనన్న లేఔట్ లు పేరు చెప్పి అప్పటి పాలకులు 300 ఎకరాల్లో 40 కోట్ల రూపాయల అవినీతి చేశారని టిడిపి పార్టీ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్ వి ఎస్ ఎన్ వర్మ ఆరోపించారు ఈ సందర్భంగా సోమవారం ఉప్పాడ గ్రామంలో పర్యటించి హర్షువులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం కేటాయించి ఇంటి నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 300 ఎకరాల్లో మట్టిని నింపుతున్న పేరుతో చెరువులలో వున్న మట్టిని తొవ్వుకొని అక్రమంగా అమ్ముకున్నారని తెలిపారు. మత్స్యార్ల కోసం ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల కోసం ఎస్ ఈ జెడ్ లో ఉన్న 100 ఎకరాల ల్యాండ్ డి నోటిఫికేషన్ చేయాలని అప్పుడు కేంద్ర ప్రభుత్వానికి అపిల్ చేయడం జరిగిందని అలాగే కొమరగిరి పంచాయతీ ఆనంద నగర్ లో ఉన్న 72 ఎకరాల లేఅవుట్ భూమిని ఆపిల్ చేసిన 100 ఎకరాలు వైసీపీ ప్రభుత్వంలో ఉన్న కాకినాడ ఎమ్మెల్యేకి అప్పటి నాయకులు దారాదాతం చేసినట్లు తెలిపారు పిఠాపురం నియోజకవర్గంలో కొమరగిరి పవర్ ప్లాంట్ వద్ద 100 ఎకరాలు ఆనంద్ నగర్ లేఔట్ లో 72, పిఠాపురం టౌన్ లేఔట్ లో 60, గొల్లప్రోలు 40, చందుర్తి 11 ఎకరాల్లో వివిధ గ్రామాల్లో నివసించే వారికి పొంతన లేకుండా గ్రామాలకు సంబంధం లేకుండా కమిషన్ల కోసం ఎక్కడో దూరంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసారన్నారు ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్, టిడిపి సభలో మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు ఉప్పాడ, అమీనాబాద్, మూలపేట మత్స్యకారులకు ఇల్లా స్థలం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అని శెట్టి సత్యానంద రెడ్డి, మాజీ జడ్పిటిసి బత్తుల రాజేష్, రాయుడు శ్రీరాములు, కోర్సు సర్పంచ్ రొంగల వీరబాబు, మాజీ ఎంపీటీసీ సన్నిబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు

## రమణక్కపేటలో ఆర్వోవాటర్ ప్లాంట్ ప్రారంభం



యు.కొత్తపల్లి మార్చి 24(మనం న్యూస్) కాకినాడ సెజ్ పరిధిలోని రమణక్కపేట గ్రామంలో ఆరో ఇన్ఫ్రా – కాకినాడ సెజ్ ఆధ్వర్యంలో సుమారు 10 లక్షలతో గంటకు 1000 లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ను గ్రామ సర్పంచ్ కాదులూరి అమ్మాజీ, జనసేన నాయకులు ఆలమూరు బాబీ, సోమవారం ప్రారంభించారు. ఈ ప్లాంట్ వలన గ్రామం లోని 4000 మంది ప్రజలకు, మూడు పాఠశాలలు, నాలుగు అంగన్ వాడీ కేంద్రాలకు రోజు త్రాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి అని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ కాదులూరి అమ్మాజీ, మాట్లాడుతూ రమణక్కపేట గ్రామం సముద్ర తీరానికి దగ్గరలో ఉండడంతో భూగర్భ జలాల్లో ఉప్పు శాతం ఎక్కువగా ఉండి తాగేందుకు పనికిరాకపోవడంతో గ్రామ ప్రజలు చాల సంవత్సరాల నుండి ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ ఇబ్బందిని కాకినాడ సెజ్ వారి దృష్టికి తీసుకువెళ్లడంతో వారు వెంటనే స్పందించి గ్రామంలో గంటకు 1000 లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచి నీటి ప్లాంటును ఏర్పాటు చేశారంటూ సెజ్ నిర్వాహకులను ఈ సందర్భంగా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. జనసేన నాయకులు ఆలమూరి బాబీ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ప్లాంట్ యొక్క నిర్వహణ జరుగుతుందని, దానికి గాను ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, నిర్వహణ ఖర్చుల కొరకు మాత్రమే లాభాపేక్షలేకుండా కనీస ధరతో శుద్ధమైన రక్షిత మంచినీటిని గ్రామ ప్రజలకు ఈ కమిటీ అందిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలమూరి వెంకట లక్ష్మి, ఎంపీటీసీ, చెల్లూరి రాము, మురాలశెట్టి సత్తిబాబు, అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు, సెజ్ ప్రతినిధులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సిసి రహదారికి భూమి పూజ



కాట్రేనికోన మార్చి 24 మనం న్యూస్ కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంటుందని మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వర రావు ఆకాంక్షించారు.కాట్రేనికోన పంచాయతీ పరిధిలో గేటు సెంటర్ నుండి పోలీస్ క్వార్టర్స్ వరకు సిమెంట్ రోడ్డు రహదారికి భూమి పూజ నిర్వహించారు అనంతరం నాగిడి మాట్లాడుతూ గ్రామాల్లో దశల వారీగా రహదారుల అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు ఉపాధి నిధులు 62 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్,టిడిపి నాయకులు వాసంశెట్టి రాజేశ్వర రావు,విత్తనాల శ్రీనివాస రావు,సత్తాల ప్రసాద్, పి ఎస్ ఎన్ రాజు ,గుత్తుల సూరిబాబు తదితరులున్నారు

## మూలపాడు గ్రామ పంచాయతీకి టీబి ముక్త్ అవార్డు



ఇబ్రహీంపట్నం, మార్చి 24 మనం న్యూస్, మూలపాడు గ్రామా పంచాయతీలో ఇప్పటివరకు ఒక్క టీబీ కేసు కూడా నమోదు కాకపోవటంతోరాష్ట్ర స్థాయిలో టిబి ముక్త్ అవార్డును మూలపాడు గ్రామపంచాయతీ ఎంపిక అవ్వడంతో గ్రామ సర్పంచ్ చింతల భూలక్ష్మి, కార్యదర్శి పోసాని అనిల్ కుమార్ లకు సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా చేతుల మీదగా అవార్డును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల భూలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యశాఖ డిఎంహెచ్వో. సంబంధిత అధికారులు మూలపాడు గ్రామానికి ఈ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారని. ఇలాంటి అవార్డులు గ్రామానికి రాష్ట్రం మొత్తంలో కూడా మా గ్రామం గుర్తించబడటం మాకు చాలా సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు సర్పంచ్ చింతల భూలక్ష్మి కార్యదర్శి అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## కవి డా జొన్నకూటి ప్రమోద్ కి సన్మానం.



తాళ్లపూడి, 24 మార్చి (మనం న్యూస్ )పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్నరచనలపై పరిశోధనా పత్రం సమర్పించిన డా జొన్న కూటి ప్రమోద్ కుమార్ శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో సత్కారం అందుకున్నారు. ఆదివారంరాజమండ్రిలో ఏపి ప్రభుత్వ, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన బోయి భీమన్న జాతీయ సాహిత్య సదస్సులో మహాకవి భీమన్న రచనలపై డా ప్రమోద్ సమర్పించిన “డా బోయి భీమన్న రచనల్లో సామాజిక స్పృహ” అనే పరిశోధన పత్రానికి పురస్కారం లభించడం పట్ల పలువురు ప్రమోద్ ను అభినందించారు. కార్యక్రమంలో డా బోయి భీమన్న సతీమణి హైమావతి, శ్రీ శ్రీ కళా వేదిక సి ఇ ఓ డా కత్తిమండ ప్రతాప్, జాతీయ కార్యదర్శి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ టి. పార్థసారధి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నరసిపల్లి హరిక, శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జి. జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, మహిళా విభాగం అధ్యక్షురాలు చెట్టి లలిత, ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయ తెలుగు సహాయ ప్రొఫెసర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ అద్దంకి రాజయోనా తదితరులు పాల్గొన్నారు.

### ఉగాది ఉత్సవాల సందర్భంగా పురవీధులలో ఊరేగితున్న గ్రామదేవత బస్సులమ్మ తల్లి



తాడేపల్లిగూడెం మార్చి24 మనం న్యూస్తాడేపల్లిగూడెం గ్రామదేవత శ్రీ బలుసులమ్మ తల్లి ఉగాది ఉత్సవాలన పురస్కరించుకొని ఈరోజు 9,10, 11, 12 వార్డులలో అమ్మవారు గరగల నృత్యాలతో, తాళమేళాలతో వాయిద్యాలతో పుట్టింటి పాశం వారి ఇంటి వద్ద పొన్పు కార్యక్రమానికి సిద్ధమవుతున్న అమ్మవారు. 11 సంవత్సరాల క్రితం అంగరంగ వైభవంగా జాతర జరుగగా మరలా తిరిగి తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ప్రోత్సాహంతో ఉగాది ఉత్సవాల నిర్వహిస్తున్నారని త్వరలో జాతర మహోత్సవానికి కూడా రంగం సిద్ధం చేస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారులు తెలియజేశారు. శ్రీరంగం అంజిబాబు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ నేతృత్వంలో వార్షిక రజక ఆసాదులతో ఊరేగింపు నిర్వహించారు. ఇళ్ళ ముందుకు వచ్చిన అమ్మవారు కు పసుపు నీళ్లతో వారు పోశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు అడ్డాల నరసింహారావు సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

## ఇసుక తరలింపులో జాగ్రత్తలు పాటించకపోతే కఠిన చర్యలు



తాళ్లపూడి, 24 మార్చి (మనం న్యూస్ )ఇసుక రవాణా చేసే వాహనాల పై టారఫాలిన్ కప్పు కుండా వెళ్లే లారీలు కానీ ట్రాక్టర్ కానీ ఏ వాహనాల పైనైనా కేసు నమోదు చేస్తామని తాళ్లపూడి ఇంచార్జి తహశీల్దార్ భారతి హెచ్చరించారు. వాహన దారుల నిర్లక్ష్యం తో ఏటి గట్టు రహదారి లో ఆర్ అండ్ బి రోడ్లపై పడ్డ ఇసుక ప్రమాద భరితంగా మారటం తో ఆ ఇసుక ను తొలగించే కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇటీవల ఏటి గట్టు పై ప్రమాదకరంగా ఇసుక రవాణా వార్త మీడియా లో రావటం తో స్పందించిన తాళ్లపూడి ఇంచార్జి తహసీల్దార్ భారతి ఇసుక ను తొలగించే చర్యలు చేపట్టారు. ఇసుక రోడ్లపై చేరిన ప్రాంతానికి సమీపం లో గల ఇసుక రీచ్ లు నిర్వాహకులు కొంత మంది స్పందించక పోవటం తో రెవిన్యూ శాఖ స్వంత చర్యలు తీసుకుందన్నారు.

## వేసవిలో నీటి సమస్య లేకుండా ముందస్తు ఏర్పాట్లు



తాళ్లపూడి, 24 మార్చి (మనం న్యూస్)వేసవి ఎద్దడి ని ఎదుర్కొనే విధం గా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు ముందస్తుగానే తీసుకున్న నిర్ణయం వల్ల పలు గ్రామాల్లో త్రాగునీటి ఇబ్బందులు ఎదురవ్వలేదని చెప్పవచ్చు. ప్రస్తుతం తాళ్లపూడి మండలం లో అవసరం మేరకు బోర్లు మంజూరు కాగా జెడ్పి ద్వారా మంజూరు అయిన బోర్లు వేస్తున్నామని ఆర్ డబ్ల్యు ఎస్ ఏ.ఈ. తెలిపారు. అలాగే జలజీవన్ మిషెన్ ద్వారా మరి కొన్ని బోర్లు, వాటర్ ట్యాంక్లు మరియు ఉచిత కుళాయిలు మంజూరు అయినట్లు ఆర్ డబ్ల్యు ఎస్ అధికారి సూర్జహాన్ వెల్లడించారు. బోరు వేయటానికి 5 లక్షలు చొప్పున మంజూరు కాగా, ప్రక్కిలంక, గజ్జరం గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. వేగేశ్వరపురం, టి.మెట్ట, పోచవరం గ్రామాలకు ఒక్కక్క బోరు వేయాల్సి ఉందన్నారు. కాగా జలజీవన్ మిషెన్ ద్వారా అన్నదేవరపేట, తుపాకులగూడెం, తాడిపూడి, పైడిమెట్ట, పెద్దేవం, టి.మెట్ట, వేగేశ్వరపురం గ్రామాలకు బోర్లు మంజూరు కాగా వేగేశ్వరపురం లో పనులు జరుగుతున్నాయని తెలిపారు. జలజీవన్ మిషెన్ ద్వారా 39 లక్షలతో 10 హెబిటేషన్స్ లో పైప్ లైన్ మంజూరు అయ్యిందని అన్నారు.